

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 30-10-2024 | సంపుటి - 21 | సంచిక -194 | రూ : 4 | పేజీలు: 8




## కేరళ ఆలయంలో బాణసంచా

- తొక్కిసలాట.. 150 మందికి గాయాలు
- తెయ్యం ఉత్సవాల్లో అపశ్రుతి
- ఆలయ ప్రాంగణంలోని షెడ్డులో పెద్ద ఎత్తున
- బాణసంచా నిల్వ.. నిప్పురవ్వలు పడి పేలుళ్లు

2లో

# కుర్చీలాటలో కీలకంగా మారిన ఉప ఎన్నిక..

### చెన్నపట్నలో గెలిస్తే డీకేనే సీఎం!



- కర్ణాటక కాంగ్రెస్‌లో మళ్లీ 'కౌన్ బనేగా సీఎం' చర్చ
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న డిప్యూటీ సీఎం శివకుమార్
- గెలిస్తే సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పీఠానికి ఎసరు?

బెంగళూరు, అక్టోబర్ 29: కర్ణాటక కాంగ్రెస్‌లో మళ్లీ ముఖ్యమంత్రి పదవిపై కుర్చీలాట మొదలయ్యింది. ఉప ముఖ్యమంత్రి, కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేసేలా అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆయన వర్గీయులు, ఒక్కలిగ సామాజకవర్గ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం వచ్చే నెల 13న జరగనున్న చెన్నపట్న అసెంబ్లీ నియోజవర్గ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారు.

**ప్రతిష్ఠాత్మకంగా చెన్నపట్న ఉప ఎన్నిక**

కుమారస్వామి రాజీనామాతో ఖాళీ అయిన చెన్నపట్న నియోజకవర్గం డీకే శివకుమార్ సొంత జిల్లా అయిన రామనగరలో ఉంది. 2009 నుంచి కాంగ్రెస్ ఇక్కడ ఒక్కసారీ గెలవలేదు. జేడీఎస్‌కు, దేవెగౌడ కుటుంబానికి ఇది పట్టున్న ప్రాంతం. ఉప ఎన్నికలో జేడీఎస్ తరపున, బీజేపీ మద్దతుతో కుమారస్వామి కుమారుడు నిఖిల్ పోటీ చేస్తున్నారు. దీంతో ఈ ఉప ఎన్నిక కర్ణాటక రాజకీయాల్లో కీలకంగా మారింది. ఐదుసార్లు ఇక్కడి నుంచి గెలిచిన సీపీ యోగేశ్వరను కాంగ్రెస్ బరిలో నిలిపింది. ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే సీఎం పదవికి చేరువ కావొచ్చని డీకే శివకుమార్ భావిస్తున్నారు. అందుకే 'నేను అభ్యర్థిని అనుకొని ఓటు వేయండి' అంటూ ఆయన చెన్నపట్న ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

తరువాయి 2లో



## భారత్‌లో మళ్లీ పెన్సిలిన్ ఉత్పత్తికి శ్రీకారం

- 30ఏళ్ల తర్వాత దేశీయంగా తయారీ
- కాకినాడలో అరబిందో ఫార్మా లైఫియస్ ప్లాంట్ ప్రారంభం
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- 135 ఎకరాల్లో.. 2,500 కోట్ల పెట్టుబడి
- ఇక్కడ పెన్సిలిన్-జి ఉత్పత్తి

తొండంగి, అక్టోబరు 29 : మూడు దశాబ్దాల తర్వాత భారత్‌లో మళ్లీ పెన్సిలిన్ ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 1990వ దశకంలోనే దేశంలో ఉత్పత్తిని ఆపేసిన తర్వాత మళ్లీ ఇప్పుడు తొలిసారిగా పెన్సిలిన్ ఉత్పత్తి ప్లాంట్‌ను ప్రారంభించింది. ఈ అవకాశం ఆంధ్రప్రదేశ్‌కు దక్కింది. అరబిందో ఫార్మా కంపెనీ కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవినగరం గ్రామంలో నిర్మించిన లైఫియస్ ఫార్మా ప్లాంట్‌ను ప్రధాని మోదీ మంగళవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ ప్లాంట్‌లో యాంటీబయాటిక్ మందుల తయారీలో కీలకమైన పెన్సిలిన్‌జీని ఉత్పత్తి చేయనున్నారు. ప్రపంచవ్యాప్తంగా పెన్సిలిన్ తయారీలో చైనాను కింగ్‌గా చెబుతారు. పెన్సిలిన్‌ను అధిక మొత్తంలో ఉత్పత్తి చేయడం,

తరువాయి 2లో

# మూసీపై తగ్గేదేలే..

- 1న పునరుజ్జీవన పనులకు శంకుస్థాపన చేస్తా: సీఎం రేవంత్
- పునరుజ్జీవంపై వెనకడుగు వేయబోం
- నవంబర్ 1న పనులకు శంకుస్థాపన చేస్తా
- ప్రాజెక్టు కోసం పైసా కూడా ఖర్చు పెట్టం
- నిధులన్నీ ప్రైవేటు సంస్థల నుంచే సేకరణ
- బాపూఘాట్‌లో ఎత్తయిన గాంధీ విగ్రహం
- అవసరమైతే మూసీ వెంట పాదయాత్ర
- హైడ్రాతో రియల్ ఎస్టేట్ పడిపోలేదు
- దక్షిణ కొరియా పర్యటనకు వెళ్లి వచ్చిన జర్నలిస్టులతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్



హైదరాబాద్, అక్టోబర్ 29 : మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నవంబర్ 1న మూసీ పనులకు

తరువాయి 2లో

## 'గ్రేటర్'లో అసెంబ్లీ సీట్లు డబుల్!

- 24 నుంచి 50కు చేరే చాన్స్.. గ్రామీణ ప్రాంతాల్లో పెరిగే సీట్లు తక్కువే
- నియోజకవర్గాల పునర్విభజనకు అడుగులు
- మొత్తం సీట్లలో మహిళలకు మూడో వంతు!
- 2025-26లో దేశవ్యాప్తంగా జనగణన



హైదరాబాద్, అక్టోబరు 29: దేశవ్యాప్తంగా జనగణనను 2025 మొదట్లో ప్రారంభించి.. 2026లో పూర్తిచేసి జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు రాష్ట్రంలో అడుగులు పడుతున్నాయి. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 26(1) ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లు పెంచాలనే అంశం పొందుపరిచారు.

తరువాయి 2లో

## ఇక 70 ఏండ్లు పైబడిన అందరికీ ఆయుష్మాన్ భారత్

- ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఎయిమ్స్ దవాఖానల్లో డ్రోన్ సేవలు


న్యూఢిల్లీ: కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం ఇక నుంచి 70 ఏండ్ల పైబడిన అందరికీ వర్తించనుంది. తొమ్మిదో ఆయుర్వేద దినోత్సవం, ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఢిల్లీలో వయో వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ పథకం కింద 70 ఏండ్ల వయసు దాటిన అందరికీ ఆర్థిక



స్థోమతతో సంబంధం లేకుండా ఉచిత వైద్యం అందనుంది. వయోవృద్ధులు ఉచిత చికిత్స పొందేందుకు వీలుగా 'ఆయుష్మాన్ వయ వందన కార్డు'లను అందించనున్నట్టు ప్రధాని మోదీ ప్రకటించారు. కాగా, ఈ పథకాన్ని ఢిల్లీ, బెంగాల్ ప్రభుత్వాలు

తరువాయి 2లో

## ఏప్రిల్‌లోనే ఎంట్రెన్స్‌లు!



- నెల ముందుగానే నిర్వహించే యోచన
- అడ్మిషన్లలో జాప్యాన్ని నివారించేందుకే..
- ప్రవేశ పరీక్షల సెట్లకు త్వరలో కొత్త కమిటీలు

2లో

## 110 మోమోస్ తయారీ కేంద్రాల్లో తనిఖీలు



- 69 నమూనాలు సేకరించామని జీహెచ్ఎంసీ వెల్లడి


హైదరాబాద్: కల్తీ మోమోస్ తిని ఒకరు మృతి చెందగా అనేకమంది ఆసుపత్రిపాలైన దుర్ఘటన నేపథ్యంలో నగరవ్యాప్తంగా మంగళవారం జీహెచ్ఎంసీ తనిఖీలు చేపట్టింది.

110 కేంద్రాల నుంచి 69 నమూనాలను సేకరించి పరీక్షలకు పంపినట్లు వివరించారు. మెజార్టీ కేంద్రాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, యజమానులకు నోటీసులు ఇచ్చామని తెలిపారు. పలు కేంద్రాలకు తాళం వేసినట్లు యంత్రాంగం పేర్కొంది.

తరువాయి 2లో

## డిస్కంల పొరపాటు..

- విద్యుత్తు వినియోగదారులకు గ్రహపాటు
- సకాలంలో ఏఆర్ఆర్‌లు సమర్పించని డిస్కంలు
- ఆ భారం మళ్లీ వినియోగదారులపైనే



హైదరాబాద్, అక్టోబర్ 29: విద్యుత్తు సంస్థలు (డిస్కంలు) చేస్తున్న పొరపాటు రాష్ట్రంలోని విద్యుత్తు వినియోగదారులకు

తరువాయి 2లో

# మూసీపై తగ్గేదేలే..

(మొదటిపేజీ తరువాయి)

శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ పూర్తిచేశామని రుణమాఫీ కింద దాదాపు రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. సాంకేతిక కారణాలతో కొన్ని ఆగిపోయి ఉండొచ్చని, వాటిని కూడా త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా పూర్తయినట్టు తెలిపారు. కొరియా పర్యటనకు వెళ్లి వచ్చిన జర్నలిస్టులతో మంగళవారం సచివాలయంలో రేవంత్‌రెడ్డి చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు అడ్డుకున్నా మూసీ విషయంలో తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజలను కష్టపెట్టి భూములు తీసుకోబోమని, మూసీ కోసం భూములిచ్చే వారికి వందశాతం సంతృప్తి చెందేలా ప్యాకేజీ ఇస్తామని వివరించారు. బాపూ ఘాట్ నుంచే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

**రూపాయి కూడా ఖర్చు చేయం**

మూసీ అభివృద్ధి అధ్యయనానికి నగర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను సియోల్‌కు పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. మూసీ పునరుజ్జీవంపై కావాలనే చర్చకు తెరలేపినట్టు తెలిపారు. ఈ చర్చ కారణంగానే మూసీపై ప్రజలకు అవగాహన కలిగిందన్నారు. మూసీ ప్రాజెక్టు ద్వారా పర్యాటకం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తొలి దశలో బాపూ ఘాట్ నుంచి గండిపేట, హిమాయత్‌సాగర్ వరకు 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయనున్నట్టు వివరించారు. ఇందుకు సంబంధించి నెల రోజుల్లో డిజైన్లు పూర్తవుతాయని చెప్పారు. మల్లన్నసాగర్ నుంచి రూ. 7 వేల కోట్లతో నీటిని ఉస్మాన్‌సాగర్‌కు మళ్లిస్తామని, అక్కడి నుంచి హిమాయత్‌సాగర్‌కు పంపుతామని తెలిపారు.

ట్రంక్‌లైన్ కోసం వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామన్నారు. ప్రతిపక్షాలు రూ.1.5 లక్షల కోట్లు అని విమర్శలు చేస్తున్నాయి కానీ, ప్రభుత్వ నిధుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయబోమని, పూర్తి నిధులను ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం నుంచే సేకరిస్తామని చెప్పారు. బాపూ ఘాట్ వద్ద ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, అక్కడే బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణం చేపడతామని, ఇందుకోసం ఆర్మీ భూమిని కూడా అడిగినట్టు తెలిపారు. 15 రోజుల్లో ఎస్టీపీలకు టెండర్లు పిలుస్తామని, మూసీ వెంట అంతర్జాతీయ యూనివర్సిటీ, గాంధీ ఐడియాలజీ సెంటర్, రిక్రియేషన్ సెంటర్, నేచర్ క్యూర్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని వివరించారు.

మూసీని మరొక సిటీగా అభివృద్ధి చేస్తామని, రూ. 141కోట్లతో డీపీఆర్ తయారీకి కన్సెల్టెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు చెప్పారు. మూడు నెలల్లోనే నివేదిక వస్తుందని తెలిపారు. మూసీని ఎకో ఫ్రెండ్లీ, వెజిటేరియన్ కాన్సెప్ట్‌తో అభివృద్ధి చేస్తామని వివరించారు. మూసీ వెంట రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మార్కెట్ ఉండేలా ప్లాన్ చేస్తున్నట్టు తెలిపారు. మూసీకి ఎలాంటి ఫైనాన్షియల్ మోడల్ వాడాలో డీపీఆర్‌లో తెలుస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేటీఆర్ నుంచి సలహాలు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. కేటీఆర్, హరీశ్‌రావు తమ ప్రతిపాదనలు తెలపాలని కోరారు. సమయం వచ్చినప్పుడు మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేస్తానని, అవసరమైతే వాడపల్లి నుంచి వికారాబాద్ వరకు పాదయాత్ర చేస్తానని తెలిపారు. హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ పడిపోయిందనడం సరికాదని, దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్దత వచ్చిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## డిస్కంల పొరపాటు..

(మొదటిపేజీ తరువాయి)

గ్రహపాటుగా మారుతున్నాయి. డిస్కంల తప్పిదంతో అంతిమంగా వినియోగదారులపై భారం పడుతున్నది. సకాలంలో అగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్ (ఏఆర్ఆర్) ప్రతిపాదనలను సమర్పించడంలో విఫలమవుతుండటంతో ఈఆర్సీ జరిమానాలు విధిస్తున్నది. రాబడికి కోతపెడుతున్నది. ఈ భారం మళ్లీ వినియోగదారులపైనే మోపాల్సి వస్తున్నది. అయితే ఈసారి రాబడికి కోత విషయంలో ఈఆర్సీ కాస్త పెద్దమనసు చేసుకుంది. ఐదేండ్ల రాబడికి కోత విధించాల్సి ఉండగా, కేవలం ఒక్క ఏడాది రాబడి కోతకు పరిమితం చేసింది. నిబంధనలు పాటించకుండా డిస్కంలు జనవరిలో కాకుండా 8 నెలలు ఆలస్యంగా ఈ ఏడాది ఆగస్ట్, సెప్టెంబర్‌లో ఈఆర్సీకి పిటిషన్లను సమర్పించాయి. రాబోయే ఐదేండ్ల కాలానికి ఏడాదికి రూ. 582 కోట్ల చొప్పున ఐదేండ్లకు రూ.2,500 కోట్ల రాబడిని కోల్పోయే అవకాశం ఉంది. జెన్‌కో రూ.396 కోట్లు, ట్రాన్స్‌కో అండ్ స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్‌కు రూ. 119 కోట్లు, డిస్కంలకు రూ. 62 కోట్లు, డిస్కంల రిటైల్ వ్యాపారంలో రూ. 7 కోట్ల చొప్పున ఈఆర్సీ కోతపెట్టింది. ఏఆర్ఆర్ సమర్పణలో ఆలస్యమైనందున డిస్కంలకు నెలపాటు రోజుకు రూ. 5 వేలు, ఆ తర్వాత రోజుకు రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తున్నది. దీంతో ఈఆర్సీ కోటిన్నర జరిమానా విధించింది.

## పెట్టుబడుల కటకట.. మసకబారుతున్న తెలంగాణ ఖ్యాతి

- **అప్పుడు స్వర్గధామం... ఇప్పుడు అయోమయం**
- **పెట్టుబడుల్లో టాప్-8 లిస్టులో అట్టడుగున తెలంగాణ**
- **రాష్ట్రానికి రావాల్సిన భారీ ప్రాజెక్టుల్లోనూ తగ్గుదల**
- **మనకంటే చాలా మెరుగ్గా ఒడిశా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్**
- **రేవంత్ ప్రభుత్వ ప్రతికూల నిర్ణయాలే కారణం: నిపుణులు**

హైదరాబాద్, అక్టోబర్ 29: పెట్టుబడుల సాధనలో గడచిన పదేండ్లలో దేశంలోనే అగ్రస్థానంలో ఉంటూ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన తెలంగాణలో ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఖ్యాతి మసకబారుతున్నది. రియల్ ఎస్టేట్, పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్య అవకాశాలు, సులభతర వాణిజ్యం వంటి సూచీల్లో ఇప్పటికే గత వైభవాన్ని కోల్పోయిన తెలంగాణ.. పెట్టుబడులకు సంబంధించిన సూచీలోనూ టాప్ 8 రాష్ట్రాల జాబితాలో అట్టడుగున నిలవడం ఆందోళన కలిగిస్తున్నది.

**మిగతా రాష్ట్రాల కంటే దారుణంగా**

202425లో తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్‌సెప్టెంబర్) దేశవ్యాప్తంగా 5,127 ప్రధాన ప్రాజెక్టుల ద్వారా వివిధ రాష్ట్రాల్లో రూ. 15,67,374.91 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. ఇందులో దాదాపు 25% ప్రాజెక్టులు, మరో 25% పెట్టుబడులు మహారాష్ట్రకే తరలివెళ్లాయి. ఏడాది క్రితం వరకు పెట్టుబడులకు స్వర్గధామంగా నిలిచిన తెలంగాణలో ఈ ఆరు నెలల్లో 212 ప్రాజెక్టులే వచ్చాయి.

## భారత్‌లో మళ్లీ పెన్సిలిన్ ఉత్పత్తికి శ్రీకారం

దాన్ని చాలా తక్కువ ధరకే అందించడంతో.. ప్రపంచ మార్కెట్‌లో చైనా పోటీని తట్టుకోలేక భారత్ 1990వ దశకంలో పెన్సిలిన్ ఉత్పత్తిని ఆపేసింది.

అప్పటి నుంచి చైనా నుంచే పెన్సిలిన్‌ను దిగుమతి చేసుకుంటోంది. అయితే.. 2020లో కొవిడ్ సమయంలో చైనా పెన్సిలిన్ సరఫరా చేయకుండా భారత్‌లోపాటు అనేక దేశాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. దీంతో.. ఫార్మా రంగంలో దేశీయ తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకం కింద కేంద్ర ప్రభు త్వం పెన్సిలిన్ ఉత్పత్తిని ప్రారంభించాలని నిర్ణయించింది. దీనికోసం స్వదేశీ కంపెనీల నుంచి బిడ్లు ఆహ్వానించగా... అరబిందో ఫార్మా కంపెనీ అవకాశం దక్కించుకుంది. కాకినాడ సెజ్‌లో లైఫియస్ ఫార్మా ప్లాంట్‌ను ఏడాదిన్నరలోనే నిర్మించింది. ఇది అందుబాటులోకి రావడంతో మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ దీన్ని వర్చువల్‌గా ప్రారంభించారు.

## కేరళ ఆలయంలో బాణసంచా పేలుడు

(మొదటిపేజీ తరువాయి)

కాసర్‌గడ్(కేరళ), అక్టోబరు 29: కేరళలోని ఓ ఆలయంలో జరిగిన తెయ్యం(కాళియాట్టం) ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. దేవాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన బాణసంచా హఠాత్తుగా పేలడంతో తొక్కిసలాట జరిగి సుమారు 154 మంది గాయపడ్డారు. వీళ్లలో 10 మంది తీవ్రమైన కాలిన గాయాలతో బాధపడుతున్నారు. తెయ్యం లేదా కాళియాట్టం అనేది ఉత్తర కేరళ ప్రాంతంలోని ఆలయాల్లో నిర్వహించే పురాతన కళా ప్రదర్శన. అయితే, కాసర్‌గడ్ జిల్లాలోని నీలేశ్వరం పట్టణ సమీపంలోని వీరర్కావు దేవాలయంలో సోమవారం రాత్రి తెయ్యం ఉత్సవం జరుగుతుండగా ప్రమాదం జరిగింది. ఉత్సవాల కోసం ఆలయ ప్రాంగణంలోని ఓ రేకుల షెడ్డులో పెద్ద ఎత్తున బాణసంచా నిల్వ ఉంచారు. ఆలయానికి వచ్చిన వందలాది మంది భక్తులు తెయ్యం ప్రదర్శన చూస్తుండగా ఆ షెడ్డులో పేలుడు సంభవించింది. పేలుడు శబ్దంతో జనం ఒక్కసారిగా పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగింది. ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, ఈ ఘటనకు సంబంధించి ఆలయ కమిటీకి చెందిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారిలో ముగ్గురిని మంగళవారం అరెస్టు చేశారు.

## ఏప్రిల్‌లోనే ఎంట్రెన్స్‌లు!

హైదరాబాద్, అక్టోబరు 29: రాష్ట్రంలో నిర్వహించే వివిధ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ముఖ్యంగా ప్రవేశ పరీక్షలను గతంలో కన్నా నెల రోజుల ముందుగానే నిర్వహించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు భావిస్తున్నారు. ప్రవేశ పరీక్షలను ఆలస్యంగా నిర్వహించడం వల్ల అడ్మిషన్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని అంచనా వేశారు. అడ్మిషన్లను సకాలంలో పూర్తి చేయాలంటే... ప్రవేశ పరీక్షలను కనీసం నెల రోజులు ముందుగా నిర్వహించాలనే నిర్ణయానికొచ్చారు. దాదాపు ఏప్రిల్‌లోనే ఈ పరీక్షలను పూర్తి చేయాలనే యోచనలో ఉన్నారు. రాష్ట్రంలో కరోనా తర్వాత ప్రవేశ పరీక్షల నిర్వహణ, వివిధ కోర్సులకు నిర్వహించే అడ్మిషన్ల ప్రక్రియ కొంత ఆలస్యంగా జరుగుతున్న విషయం తెలిసిందే. దీని వల్ల విద్యార్థుల్లో కొంత అయోమయం నెలకొంది. ముఖ్యంగా జాతీయ స్థాయిలో వివిధ కోర్సుల్లో చేరే విద్యార్థులకు కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. దీనిని నివారించేలా ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేయాలని భావిస్తున్నారు.

ప్రస్తుతం ఉన్న విధానం ప్రకారం.. ఎంసెట్, ఐసెట్, ఈసెట్ వంటి అనేక ప్రవేశ పరీక్షలు మే నుంచి జూన్ నెలల్లో జరుగుతున్నాయి. వాటి ఫలితాలను జూలైలో వెల్లడిస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో అడ్మిషన్లు చేపడుతున్నారు. ఈ ఏడాది కొన్ని కోర్సులకు సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను మార్చాలని భావిస్తున్నారు. వీలైతే ఏప్రిల్‌లోనే ముఖ్యమైన ప్రవేశ పరీక్షలను పూర్తి చేయడానికి వీలుగా షెడ్యూల్‌ను రూపొందించాలనే యోచనలో ఉన్నారు. ఈ అంశంపై ఉన్నత విద్యామండలి అధికారులు దృష్టి కేంద్రీకరించారు.

- **త్వరలోనే సెట్లకు కమిటీలు..**

రాబోయే విద్యా సంవత్సరం ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఆయా సెట్ల కమిటీలను కూడా త్వరలోనే ప్రకటించాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పుడున్న సెట్ల కన్వీనర్లలో కొందరిని కొనసాగిస్తూ, మిగిలిన సెట్లకు కొత్త వారిని ఎంపిక చేయాలని యోచిస్తున్నారు. ఈ సెట్ల నిర్వహణలో కొందరు కన్వీనర్లపై ఆరోపణలు వస్తుండడం, ముఖ్యంగా నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు వస్తుండడాన్ని పరిగణనలోకి తీసుకుని కొత్త సెట్లను ప్రకటించాలని నిర్ణయించారు. దీనిపై త్వరలోనే ఆయా యూనివర్సిటీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా.. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి ఒకటి రెండు రోజుల్లో కొత్త వైస్ చాన్సలర్‌ను ప్రకటించే అవకాశం ఉంది. వీసీ ఎంపికలో భాగంగా తాజాగా సెర్చ్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ పోస్టు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మూడు పేర్లను ఎంపిక చేసినట్టు సమాచారం. ఈ జాబితాలో అదే యూనివర్సిటీలో డీన్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్‌తోపాటు ఉస్మానియా యూనివర్సిటీలో పనిచేసి రిటైరయిన ప్రొఫెసర్ పేరు కూడా ఉన్నట్లు తెలిసింది. సెర్చ్ కమిటీ ఎంపిక చేసిన మూడు పేర్లను ప్రభుత్వ పరిశీలనకు పంపించారు. ఈ ప్రతిపాదనలను గవర్నర్‌కు పంపించనున్నారు. గవర్నర్ నుంచి ఆమోదం వచ్చిన వెంటనే కొత్త వీసీని ప్రకటించనున్నారు.

## ఇక 70 ఏండ్లు పైబడిన అందరికీ ఆయుష్మాన్ భారత్

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ కారణాలతో అమలు చేయడం లేదని మోదీ ఆరోపించారు. ఇక్కడి వయో వృద్ధులను ఆయన క్షమాపణ కోరారు. మరో రూ.12,850 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు ప్రాజెక్టులను సైతం మోదీ ఆవిష్కరించారు. మధుమేహం, జీవక్రియకు సంబంధించిన రుగ్మతల చికిత్సలో ఆయుర్వేద వినియోగం కోసం బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను, దేశవ్యాప్తంగా 11 ఎయిమ్స్ దవాఖానల్లో డ్రోన్ సేవలను సైతం మోదీ ప్రారంభించారు.

## 110 మోమోస్ తయారీ కేంద్రాల్లో తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

**పోలీసుల అదుపులో మరో నలుగురు**


జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: మోమోస్, మయోనైజ్ తిని ఒకరు మృతి చెంది.. 50 మందికిపైగా అస్వస్థతకు కారణమైన ఘటనలో పోలీసులు మరో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొన్నారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని నందినగర్, సింగాడకుంట బస్తీలో శుక్రవారం సంతల్లో విక్రయించిన మోమోస్‌తోపాటు మయోనైజ్ తిని సింగాడకుంట బస్తీకి చెందిన రేష్మబేగం(31) మృతిచెందగా, దాదాపు 50మందికి పైగా అనారోగ్యానికి గురై ఆసుపత్రిపాలైన సంగతి విదితమే. ఈ వ్యవహారంలో కూరగాయల వ్యాపారి ఆంజనేయులు, రేష్మబేగం సోదరుడు ఫారూఖ్ హుస్సేన్‌లు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు దిల్లీ హాట్ మోమోస్‌కు చెందిన అర్మాన్, సాజిద్ హుస్సేన్, షారూఖ్, రజిక్, ముక్రం, సాదిక్‌లపై కేసు నమోదు చేశారు. ఆదివారం అర్మాన్, రజిక్‌లను అదుపులోకి తీసుకోగా ప్రత్యేక బృందాల గాలింపులో మిగిలిన నలుగురిని మంగళవారం అదుపులోకి తీసుకొన్నారు.

## కుర్చీలాటలో కీలకంగా మారిన ఉప ఎన్నిక..

**డీకే గెలిస్తే సిద్ధూకు చిక్కులే**

డీకే వర్గీయులు కూడా చెన్నపట్నలో గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. 'ఈ ఎన్నిక డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అయ్యేలా చేస్తుంది. ఉప ఎన్నిక ఫలితం డీకే శివకుమార్ నాయకత్వాన్ని ప్రతిబింబిస్తుంది.' అంటూ డీకే వర్గీయుడు, ఎమ్మెల్యే శివలింగె గౌడ ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ కనుక కాంగ్రెస్ గెలిస్తే డీకేను సీఎం చేయాలని హైకమాండ్‌పై ఆయన వర్గీయులు ఒత్తిడి పెంచనున్నారు. ఇప్పటికే ముడా స్కామ్‌తో సతమతమవుతున్న సీఎం సిద్ధరామయ్యకు ఈ ఉప ఎన్నిక మరో తలనొప్పిగా మారింది.

## 'గ్రేటర్'లో అసెంబ్లీ సీట్లు డబుల్!



అది ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు దేశవ్యాప్తంగా మొదలయ్యే ప్రక్రియలో ముందుకు సాగనున్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 153కు పెరగనుంది. అంటే కొత్తగా 34 అసెంబ్లీ స్థానాలు ఏర్పడనున్నాయి. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 అసెంబ్లీ స్థానాలు ఉండగా మరో 26 పెరిగి 50కు చేరే అవకాశాలు ఉన్నాయి. హైదరాబాద్ నగర జనాభా అసాధారణ స్థాయిలో పెరుగుతోంది. నియోజకవర్గాల పునర్విభజనను జనాభా ప్రాతిపదికన చేపడుతుండటంతో రాష్ట్రంలో పెరిగే 34 సీట్లలో 26 సీట్లు గ్రేటర్‌లోనే పెరగనున్నాయి. ఇక గ్రామీణ ప్రాంతాలకు వస్తే సగటున ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున 8 సీట్లు పెరిగే అవకాశాలున్నాయి.

- **రాష్ట్రంలో మహిళలకు 50 సీట్లు?**

అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనతో పాటు మహిళా రిజర్వేషన్ల చట్టం కూడా అమలుచేసి 33 శాతం సీట్లను మహిళలకు కేటాయించనున్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు గత ఏడాది పార్లమెంటు ఆమోదముద్ర వేయటంతో చట్టంగా మారింది. ఈ బిల్లు ఆమోదించిన తర్వాత జరిగే జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని చట్టం చెబుతోంది. అసెంబ్లీ సీట్లు 153కు పెరిగితే ఇందులో 50 సీట్ల దాకా మహిళల కోటాకింద వచ్చే అవకాశాలున్నాయి.

- **లోక్‌సభ సీట్ల పెంపుపై వివాదం**

పార్లమెంటు స్థానాల సంఖ్యను పెంచటం మాత్రం 2026 తర్వాత జరిగే జనాభా లెక్కల ప్రాతిపదికన చేపట్టాల్సి ఉంది. కానీ ఇప్పుడు జనగణన 202526లోనే పూర్తవుతుంది. దీంతో ఈ జనగణననే పరిగణనలోకి తీసుకొని పార్లమెంటు స్థానాలు పెంచేలా మరో రాజ్యాంగ సవరణ అవసరం కావొచ్చని నియోజకవర్గాల పునర్విభజన నిపుణుడు ఇనగంటి రవికుమార్ తెలిపారు. ప్రస్తుత లోక్‌సభలో 545 సీట్లు ఉండగా పునర్విభజన తర్వాత 888కి పెంచుతామని ఎన్‌డీఏ ప్రభుత్వం లోపాయికారీగా చెబుతోంది. దీన్ని 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి పూర్తి చేయాలని భావిస్తోంది. మరోవైపు లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎందుకంటే సీట్ల పెరుగుదల జనాభా ప్రాతిపదికన జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణ పాటించటంతో జనాభా తక్కువగా ఉంది. ఈ విషయంలో ఉత్తరాది రాష్ట్రాలు ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో అక్కడ జనాభా పెరిగింది. ఇప్పుడు లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ, ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు వస్తాయి. దీంతో దక్షిణాది నుంచి పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# ధన్వంతరి మూర్తి కులంలో మేము పుట్టడం మా పూర్వజన్మ సుకృతం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ధన్వంతరి మూర్తి కులంలో మేము పుట్టడం మా పూర్వజన్మ సుకృతమని కెపిహెచ్ బి నాయి బ్రాహ్మణ అసోసియేషన్ ప్రెసిడెంట్ పన్నాడి రమేష్ అన్నారు. కెపిహెచ్బి నాయి బ్రాహ్మణ ఆధ్వర్యంలో కుల దైవం ధన్వంతరి నారాయణమూర్తి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధన్వంతరి మా కుల దైవం అయినందుకు మాకు జన్మ ధన్యం అయింది మనుగడ పుట్టినప్పటి నుండి చచ్చేదాకా ఆయుర్వేదం ఎంతో అమృతం లాంటిది దానిని ఇప్పుడు అందరు వదిలేసి ఇంగ్లీష్ మందులకి అలవాటు పడ్డారు అనధికారంలో ఆయుర్వేదిక్ కు ఎంతో ప్రాముఖ్యత ఉండేది అప్పుడు ఇంగ్లీష్ మందులు లేవు ఓన్లీ ఆయుర్వేదిక్ ఇప్పుడు ఇంగ్లీష్ మందులు వచ్చాయి ఆయుర్వేదిక్ ఉన్నప్పుడు ఎలాంటి రోగాలు లేవు ఇప్పుడు ఇంగ్లీష్ మందులు వచ్చాక అన్ని రోగాలే అందుకే మళ్ళీ మా ధన్వంతరి నారాయణమూర్తి ఈ భూమి మీదకి రావాలి మళ్లీ ఆయుర్వేదానికి ప్రాణం పోయాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నరసింహ నాయి, సెక్రటరీ . పన్నెండి రమేష్ నాయి. మాజీ అధ్యక్షులు తాటిపాముల వెంకటేష్ నాయి., వార్డ్ మెంబర్ సతీష్ నాయి,. వార్డు నెంబర్ ., కృష్ణ ,మహేష్. రమేష్. శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు.

# పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలి

* **కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శివ చౌదరి**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : సీనియర్ సిటిజన్స్ కోసం పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శివ చౌదరి అన్నారు. మంగళవారం కేపీహెచ్ బీ కాలనీలో 3వ ఫేజ్ లో గల పార్కులలో ఆయన తో పాటు బచ్చుమల్లి లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్కుల అపరిశుభ్రత, నిర్లక్ష్యం పై మెయింటెనెన్స్ టీం, వర్కర్లను మందలించి,సూచనలు సలహాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉదయం సాయంత్రం వచ్చే వాకర్స్ కి ఇబ్బందులు లేకుండా చూడాలని, అలాగే పిల్లల ఆట స్థలాలు పరిశుభ్రంగా ఉండాలని, వర్షాల కారణంగా పార్కు స్థలాల్లో గడ్డి విపరీతంగా పెరగటం వలన వెంటనే కలుపు మందు కొట్టాలని మెయింటెనెన్స్ టీం వారికీ సూచించారు. మెయింటెనెన్స్ టీం కి రావాల్సిన పెండింగ్ బకాయిలను అధికారులతో మాట్లాడి, వారం రోజుల్లోగా వారి అకౌంట్లోకి వచ్చేలాగా బిల్స్ ప్రాసెస్ కోసం చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి రెండు వారాలకు ఒకసారి ప్రతి పార్కు సందర్శిస్తానని యువ నాయకులు తెలియజేశారు. జిహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి మట్టి కుప్పలను, విరిగిపోయిన చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. అధికారులు వెంటనే స్పందించి, తక్షణ చర్యలు చేపట్టారు.

# స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం



ప్రజాస్ఫూర్తి ,నాగారం: నాగారం మండలం వర్ధమానుకోట గ్రామానికి చెందిన సింగారపు సాగర్ (28) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వర్ధమానుకోట జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల 2010 11 సంవత్సరం తన తోటి పదో తరగతి స్నేహితుల బృందం మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు. అనంతరం సాగర్ బాల్య సింగరపు సౌమ్యకు 30000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్నేహితుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో 201011 పదో తరగతి విద్యార్థుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ లో నింపిన షెడ్యూల్ ఫారాలను జాగ్రత్తగా భద్రపరచాలి

* **మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి ) : ఎన్యూమరేషన్ లో నింపిన షెడ్యుల్ ఫారాలను జాగ్రత్తగా భద్రపరచాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై మంగళవారం మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శేఖర్ తో కలిసి జిల్లా అదనపు కలెక్టరు సూపర్ వైజర్లకు శిక్షణా కార్యక్రమాన్నిఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ , కుల సర్వే ప్రధాన ఉద్దేశం అని అన్నారు. సిపిఓ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో సర్వే ఎలా నిర్వహించాలని, డేటాను ఎలా సేకరించాలి, సర్వేలో ఎదురరుయ్యే సాధారణ సమస్యలను ఎలా పరిష్కరించాలి అనే విషయాల పై వివరంగా అదనపు కలెక్టరు సూచనలు అందించారు. రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే అని అన్నారు. ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన ఈబి లో ప్రతి కుటుంబాన్ని క్రమపద్ధతిలో జాబితా తయారు చేసి ప్రతి కుటుంబానికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించాలని, అనంతరం హౌజింగ్ లిస్ట్ అయిన ప్రతి ఇంటి ముఖ్య ద్వారానికి ప్రక్కన స్టిక్కర్ ని అతికించాలన్నారు. ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిలోని వారితో గౌరవంగా, మర్యాదగా మాట్లాడాలని సూచించారు. ఎన్యుమరేషన్ సమయంలో కుటుంబయజమాని నుండి సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచబడతుందన్నారు. ఎన్యుమరేటగర్ నిర్దేశించిన డేటా ఎంట్రీ కేంద్రానికి వచ్చి ఆపరేటర్ తో డేటా ఎంట్రీని పూర్తి చేయించాలన్నారు. సూపర్ వైజర్లు ఫీల్డ్ లో ఎన్యుమరేటర్ల పనితీరును పర్యవేక్షించి అవసరమైన సహాయాన్ని అందించాలన్నారు. ఎన్యుమరేటర్లు సేకరించిన డేటాలో 10 శాతం రాండమ్ కుటుంబాలను ఎంచుకుని ఇఆ ఇండ్లను సందర్శించి డేటాను మరలా తనిఖీ చేయాలన్నారు. సర్వే ప్రక్రియలో కిందిస్థాయి ఎన్యూమరేటర్లకు మార్గదర్శకంగా వ్యవహరిస్తూ సహాయం అందించాలన్నారు. సర్వే సమర్థవంతంగా నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం సర్వేకు సంబంధించిన నిర్ణీత ఫారాలను ఏవిధంగా పూరించాలనే అంశం పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలిపారు.

# పకడ్బందీగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టి విజయవంతంగా నిర్వహించాలి


- **నవంబర్ 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ**
- **రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు**
- **సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై వీడియో కాన్ఫరెన్స్**



ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ పకడ్బందీగా చేపట్టి సర్వేను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు.మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు మధిర తహసిల్దార్ కార్యాలయం నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై సమీక్షించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు తయారు చేసిన ప్రణాళిక, సర్వే ఉద్దేశం, జిల్లా స్థాయిలో కలెక్టర్ లు తీసుకోవాల్సిన చర్యలు మొదలగు అంశాలను ఉప ముఖ్యమంత్రి వివరించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే) నిర్వహణ విధి విధానాలను క్యాబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదించామని అన్నారు.ఈ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ, కుల వివరాలను సేకరిస్తామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఉన్నతమైన ఆలోచనతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడుతుందని, ఎస్సీ ఎస్టీ ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ అవకాశాల వారికి మెరుగుపరచడానికి తగిన ప్రణాళికలు తయారు చేసేందుకు ఈ సర్వే ఉపయోగిస్తామని ఉప ముఖ్యమంత్రి అన్నారు. 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ ఉండేలా ఈబీ మ్యాప్ లను అప్ డేట్ చేయాలని, ఎన్యుమరేటర్ కు నిర్దిష్టమైన ఎన్యుమరేషన్ బ్లాక్ (ఈబీ) కేటాయించాలని, 10 ఈబీ బ్లాక్ లకు డేటా సేకరణ పర్యవేక్షణకు సూపర్వైజర్ ఉండాలని, సూపర్ వైజర్ 10% ఇండ్లను ర్యాండం గా ఎంచుకొని డేటా వివరాలు తనకి చేయాలని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సర్వే నిర్వహణకు అవసరమైన ఫారంలు మార్గదర్శకాలు ముద్రణ స్టేషనరీ ఏర్పాట్లు చేయాలని, ఇండ్ల జాబితా చేపట్టాలని అన్నారు. సర్వే షెడ్యూల్ వివరాలు ప్రజలకు చేరేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, నవంబర్ 6 నుంచి సర్వే ప్రారంభించాలని, సర్వే చేస్తున్న సమయంలో కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు ధరణి పాస్ పుస్తకాలు కుటుంబం దగ్గర ఉంచుకునేలా విరుద్ధంగా ప్రచారం చేయాలని అన్నారు. సర్వే వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాలని అన్నారు. ఎన్యుమరేషన్ సమయంలో కుటుంబం యజమానికి వారి వద్ద నుంచి సేకరించే సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని తెలియజేయాలని, నింపిన షెడ్యూల్ ఫారం లోని జాగ్రత్తగా భద్రపరచాలని, ఈ డేటా ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోకూడదని తెలిపారు. రోజువారి సర్వే పూర్వకతిని జిల్లా వారీగా ఏరోజు కారోజు సాయంత్రం 6 గంటలకు తెలియజేయాలని అన్నారు. సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.జిల్లా కలెక్టర్ ల బాధ్యతలు స్పష్టంగా తెలియజేసామని, సిద్దిపేట నుంచి పాల్గొన్న రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ చరిత్రలో నిలిచిపోయే ప్రక్రియ అవుతుందని అన్నారు. సర్వే నిర్వహణ పై శాసనసభ తీర్మానం ప్రవేశపెట్టి, క్యాబినెట్ లో ఆమోదం పొంది సంబంధిత ఉత్తర్వులు జారీ చేశామని అన్నారు. ప్రతి 150 కుటుంబాలకు ఒక ఎన్యుమరేటర్ సిద్ధం చేయాలని అన్నారు. సర్వే ప్రక్రియ పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. సూపర్వైజర్ లు సర్వే వివరాలు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ క్రాస్ చెక్ చేసుకోవాలని అన్నారు. సీఎస్ నుంచి క్షేత్రస్థాయి అధికారి వరకు సమన్వయంతో పని చేస్తూ ఏ తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలని, దేశానికే రోల్ మోడల్ విధంగా మన పని తీరు ఉండాలని అన్నారు. నల్గొండ నుంచి పాల్గొన్న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ, సర్వే నిర్వహణ షెడ్యూల్ ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. సర్వే పూర్తి చేసిన ఇంటికీ స్టిక్కర్ అంటించాలని అన్నారు. నవంబర్ 6 నుంచి సర్వే ప్రారంభమవుతుందని, నవంబర్ నెల చివరి వరకు ప్రతి ఇంటి సర్వే పూర్తిచేసే వివరాలు ఆన్ లైన్ లో పక్కాగా నమోదు చేయాలని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ఎన్యుమరేటర్లతో ఇంటింటి సర్వే నిర్వహించడం ఎంత ముఖ్యమో, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి డాటా ఎంట్రీ వివరాలను తప్పులు లేకుండా ఎంట్రీ చేయడం అంతే ముఖ్యమని అన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షిస్తూ జిల్లాలలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో వెంటనే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు.జిల్లాలో వచ్చే ధాన్యం దిగుబడి, అందుబాటులో ఉన్న గోడౌన్ సామర్థ్యం మేరకు అవసరమైతే ఇంటర్మీడియట్ గోడౌన్లను సిద్ధం చేసుకోవాలని అన్నారు.మిల్లింగ్ చార్జీలు గతంలో చాలా తక్కువగా ఉండేవని, వీటిని పెంచేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ సిఫార్సు చేసిందని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, అదనపు కలెక్టర్ లు ఖీమ్యా నాయక్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

* **తెలంగాణ గిరిజన సమాఖ్య గిరిజన నేతలు కల్లూరి వెంకటేశ్వర్లు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్రంలోనీ నీఅంత పాలను పారదోలి ప్రజా పాలన తీసుకురావడంలో రాష్ట్రంలోని ఆదివాసీ గిరిజనుల పాత్ర ముఖ్యమైనదని గిరిజన సమాఖ్య జిల్లా ఇన్చార్జి కల్లూరి వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నిరసన ధర్నా చేయటం జరిగింది ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా ఇన్చార్జి కల్లూరి వెంకటేశ్వర్లు జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్ లు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అవుతున్న కానీ నేటికీ గిరిజనులకు ఇచ్చినటువంటి హామీలు అమలు కావడం లేదు ముఖ్యంగా గిరిజన మంత్రిత్వ శాఖను కూడా ఇంకా ఏర్పాటు చేయలేదు గిరిజన సమస్యలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల పైన సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని వారు అన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి యాక్షన్ ప్లాన్లు ఇవ్వకపోగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు నిరుద్యోగ యువతీ యువకులు నిరాశ నీస్పృహలకు లోన వుతున్నారు. వీటి పరిష్కారం కొరకు.ఈనెల అక్టోబరు 29వ తారీఖున రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ కార్యాలయం ముందు గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో నిరసనలు తెలియచేస్తూ కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సోంది కుటుంబరావు, గోవింద్, లక్ష్మయ్య, నగేష్, సత్యనారాయణ, చందర్, వెంకటేశ్వర్లు, శంకర్, నరేష్, శ్రీనివాస్, జానకిరామ్, విజయ్ రమేష్, శివాజీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండ్ గా పట్టుబడిన మెడికల్ కళాశాల ఏవో, జూనియర్ అసిస్టెంట్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో వరుసగా ఏసీబీ దాడులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అవినీతి అధికారుల భరతం పడుతున్నారు. మంగళవారం పాల్వంచ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఏవో ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ అన్నారు. అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల బిల్ కోసం లంచం డిమాండ్ చేయడంతో బాధితులు తమను ఆశ్రయించారని చెప్పారు. దీంతో బాధితులు వారికి లంచం ఇస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. వీరిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న అవినీతి అధికారులు ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా డి.ఎస్.పి వై .రమేష్ అన్నారు.

# దొంగకు ఏడాదిన్నర జైలు శిక్ష

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ద్విచక్ర వాహనంను దొంగతనం కేసులో దొంగకు ఏడాదిన్నర జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పును వెల్లడిచినట్లు ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ తెలిపారు. ముస్తాబాద్లో బకెట్ బిర్యాని హోటల్ యజమాని తన్నీరు నరేందర్ రావు ఆగస్టు 17, 2023 న తన హోటల్ ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీ అయ్యిందని ముస్తాబాద్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ద్విచక్ర వాహనంను దొంగతనం చేసిన పెద్ద గుండావెల్లి గ్రామానికి చెందిన పంజా చందుని అరెస్టు చేసి రిమాండ్కి తరలించారని తెలిపారు. విచారణ అనంతరం అప్పటి ఎస్ఐ శేఖర్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారని, కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ కేసు వాదించగా, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ ఆడేపు దేవేందర్ సాక్షులను ప్రవేశ పెట్టారని, కేసు పూర్వపరాలను పరిశీలించిన జడ్జి ప్రవీణ్ దొంగతనం చేసిన పంజా చందుకు శిక్ష, జరిమానా విధించారని తెలిపారు.

# ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి

* **కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 29, (అక్షర గళం ) :ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 20వ వార్డులోని జెఎన్ఎన్ యుఆర్ఎం లక్ష్మి నగర్ కాలనీలో కౌన్సిలర్ మురళి యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 80 లక్షల రూపాయలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మున్సిపల్ చైర్ పర్సన్ శంబీపూర్ కృష్ణవేణి క్రిష్ణ లు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ శివారు ప్రాంతాలలో కొత్త కొత్త కాలనీలు ఏర్పాటు అవుతున్నాయన్నారు.

# సింగరేణిలో సెక్యూరిటీ నియామకాలు చేపట్టి పటిష్టం చేయాలి

* **సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నరసింహ రావు**



ప్రజా స్పూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: పురుష,మహిళ కార్మికులను సెక్యూరిటీ సిబ్బందిలో రిక్రూట్మెంట్ చేసుకొనుట , మెరుగైన క్యాడర్ స్కీం కొరకు గత 13 సంవత్సరాలకు పైగా సెక్యూరిటీ విభాగంలో రిక్రూట్మెంట్ చేసుకోకపోవడం వలన భద్రతా విభాగంలోని సిబ్బంది ప్రతి నెల నెల తగ్గిపోతున్నారనీ, కావున సింగరేణిలో భద్రత వ్యవస్థను పటిష్టం చేయడం కొరకు సెక్యూరిటీ సిబ్బందిని భర్తీ చేయవలసిందిగా సెక్యూరిటీ జిఎం శ్రీనివాస్ కు సింగరేణి కాలనీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మందా నరసింహారావు మాట్లాడుతూ తాజాగా మహిళా కార్మికులను వివిధ పనులపై అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారనీ, వారిని ఈ సెక్యూరిటీ విభాగంలోకి తీసుకోవడం వలన వారికి కూడా సంస్థ పట్ల మరింత బాధ్యత పెరుగుతుందన్నారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ఏరియాలో ఉన్న ఖాళీగా ఉన్న సెక్యూరిటీ విభాగంలోని పోస్టులను భర్తీ చేయాలని , వారికి మెరుగైన కోల్ ఇండియా క్యాడర్ స్కీమును అమలు చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియుగా కోరుతున్నామనీ తెలిపారు.సింగరేణి కాలేజీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు వై వెంకటేశ్వరరావు సురమ్ ఐలయ్య, నాయకులు వీరన్న , రమేష్ పాల్గొన్నారు.

## తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తా

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్పూర్తి, కాప్రా : తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.మంగళ వారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ గవర్నమెంట్ ప్రైమరీ స్కూల్ దగ్గరలో రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్ ,కుషాయిగూడ అసోసియేషన్ ముఖ్య సలహా దారులు పండాల శివకుమార్ గౌడ్, అసోసియేషన్ సభ్యులు పనగట్ల చక్రపాణి, చిత్తుల కిషోర్, పంజాల బాబు, అనిల్ బాబు, కొడకండ్ల యాదయ్య, చల్లా వెంకటేష్, చిదం బాలనర్సింహా, నర్సింగ్ రావు, గణేష్ గౌడ్, దయా నంద్, సారా శ్రీధర్, దినేష్,అంజన్న,మణి కిరణ్, శ్రీనివాస్,శ్రవణ్. కాంట్రాక్టర్ వెంకటేష్, అలాగే కుషాయిగూడ స్థానికులు దేవేందర్ గౌడ్ , నర్సింగ్ అర్బ్స్, సింగిరెడ్డి పద్మారెడ్డి, మచ్చ బాబు గౌడ్ , సుధీర్ బాబు, బుడంపల్లి రఘు గౌడ్, డిజిఎమ్ సతీశ్ , ఏఈ సందీప్, కనకరాజు గౌడ్ , రాఘవ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మల్లేష్, శ్రీశైలం , కనకయ్య, రాజేష్ , ప్రసాద్ రెడ్డి , శంకర్, బాలాజీ, లోక్ నాథ్ , మధు, చిన్న, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## నో పర్మిషన్... ఓన్లీ కలెక్షన్

* **కుత్బుల్లాపూర్ లో జోరుగా బాణాసంచా అమ్మకాలు:**
* **అనుమతి లేకున్నా అధికారులు, నాయకుల అండ ఉంటే చాలా?:**



ప్రజాస్పూర్తి,కుత్బుల్లాపూర్: కళ్ళు లేని పాలకుల పాలనలో అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది.నగరం లో ఓ వైపు బాణాసంచా గోదాములు, షాపుల్లో ప్రమాదకర సంగటనలు జరిగినా అధికారులు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకున్నట్టుగా కనిపించడం లేదు.దీపావళి పండగ ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యక్తులు ఎలాంటి అనుమతి లేకుండా, కనీస భద్రత ప్రమాణాలు పాటించకుండా బాణాసంచా అమ్మకాలు చేస్తున్నారు. ప్రదానంగా జనావాసాల మధ్య బాణసంచా అమ్మకాలు చేపడుతూ తమకు అడ్డుఅదుపు లేదనట్టుగా వ్యవహారిస్తున్నారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఏ బస్తీలో చూసినా, ఏ ప్రధాన రహదారిపై చూసినా అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బాణాసంచా షాప్ లు దర్శనమిస్తున్నాయి. మరి అధికారులకు ఎమన్నా ముడుపులు అందుతున్నాయా లేదంటే స్థానిక నాయకుల అండదండలతో బాణాసంచా షాప్ లు నిర్వహిస్తున్నారో అంతు చిక్కడం లేదు కానీ అడుగు తీసి అడుగేస్తే కుత్బుల్లాపూర్ లో బాణాసంచా అమ్మే ఒక షాప్ మాత్రం మాత్రం మనకు కనిపిస్తుంది.ఎలాంటి భద్రత ప్రమాణాలు పాటించకుండా నిర్వహించే ఈ షాప్ ల ద్వారా ఏదన్నా అనుకోని సంఘటన జరిగితే అధికారులు బాధ్యత వహిస్తారో లేదంటే స్థానిక నాయకులు మూల్యం చెల్లిస్తారో చూడాలి!

## సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ఎస్ . హరీశ్ కి శుభాకాంక్షలు



హైదరాబాద్, (ప్రజాస్పూర్తి ) : మాసబ్ ట్యాంక్ లోని సమాచార శాఖ ప్రధాన కార్యాలయంలో స్పెషల్ కమీషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎస్ . హరీశ్ కి చిన్న మధ్యతరహా దిన పత్రికలు , మ్యాగజైన్ అసోసియేషన్ అధ్యక్షుడు యూసుఫ్ బాబు పాల్గొని పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆజంఖాన్, అఫ్రోజ్ , వెంకటయ్య, మోహీన్ అలీ, జాన్ షాహిద్, గోళ్ళ రమేష్, ఎస్ ఎం బాష , ఆదిల్ పాష పలు పత్రికలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు

## మోత్కుపల్లి నవీన్ కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతి అవార్డు ప్రధానం



రాజాపేట, (ప్రజాస్పూర్తి) : రాజపేట మండలానికి చెందిన మోత్కుపల్లి నవీన్ కుమార్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపికై అందుకున్నారు. మంగళవారం ఆయన విలేకరులకు వివరాలు చెప్పారు. విద్యార్థి ఉద్యమ నాయకులుగా జీవితాన్ని మొదలుపెట్టి, ప్రజా ఉద్యమకారుడిగా, దళిత చైతన్య వేదికల ద్వారా దళిత బహుజన ఉద్యమాలు చేస్తూ ప్రజలతో మమేకమై ప్రజలకోసమే తన జీవితాన్ని పెట్టి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని అనేక త్యాగాలు చేసిన పారుపల్లి వాసి మోత్కుపల్లి నవీన్ కుమార్ ని జాతీయ అవార్డు వరించింది. హైదరాబాద్ వేదికగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 7వ, రాష్ట్ర స్థాయి మహాసభలో లో ప్రముఖ సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ల చేతుల మీదుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మోత్కుపల్లి నవీన్ కుమార్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడి జీవితం త్యాగం చేసిన అంబేద్కర్ తనకు స్పూర్తి అని , ప్రజల సమస్యలపై తాను పడిన శ్రమనే ఈ అవార్డు రూపంలో గౌరవం దక్కిందని,ఈ అవార్డు అందుకోవడంతో తన బాధ్యతను మరింత పెరిగిందని ,ఇంకా ప్రజల నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉందని అన్నారు. సబ్బండ వర్గాల సంపూర్ణ సహకారం వల్లే ఇది సాధ్యమైందన్నారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత మోత్కుపల్లి నవీన్ కు రాజపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ఉప్పల రమేష్, గౌరవ అధ్యక్షులు పెంట రమేష్, ప్రధాన కార్యదర్శి గొట్టిపాముల నర్సింలు, కోశాధికారి కనుకుంట్ల శేఖర్, సంయుక్త కార్యదర్శి బాలరాజు, మండల ప్రెస్ ఫోటోగ్రాఫర్ జర్నలిస్టు బిర్రు శ్రీనివాసులు తదితరులు అభినందనలు తెలిపారు.

## క్యూబా కు అండగా నిలుద్దాం

* **అమెరికా కుట్రను తిప్పికొడదాం.**



ప్రజా స్పూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:సీఐటీయూ కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ దేశ వ్యాప్త పిలుపులో భాగంగా క్యూబా సంఘీభావ ప్రదర్శన సభ ను సింగరేణి కార్మికుల అడ్డాలు, హెడ్ ఆఫీస్ వద్ద నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మందా నరసింహ రావు మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి అమెరికా నిర్బంధంలో క్యూబా ఉందని మానవ హక్కుల ఉల్లంఘన కార్మికుల హక్కుల కాలరాస్తూ, చట్ట వ్యతిరేక కార్మిక కార్యకలాపాలు ఐక్యరాజ్యసమితి విధానాలకు వ్యతిరేకంగా అన్ని దేశాలను శాసించి, ఏక ఛత్రాధిపత్యం వహించే విధంగా అమెరికా చేస్తున్న దుర్మార్గాలకు ఎదుర్కొని నిలబడిన క్యూబా దేశాన్ని రక్షించుకోవాలన్నారు.. అక్కడి వామపక్ష నేతలపై అనేక దాడులను చేస్తూ నిర్బంధాలకు గురి చేస్తూ ఉన్నప్పటికీ క కార్మిక హక్కులు కాపాడుతూ కమ్యూనిస్టు భావజాలాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్న క్యూబాకు సంఘీభావం తెలపాలన్నారు. ప్రతి కార్మికుడికి చైతన్యపరిచి అమెరికా చేస్తున్న దుర్మార్గాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ డి వీరన్న, శురం ఐలయ్య, భూక్యా రమేష్, భాస్కర్, సక్రం, ప్రభాకర, కిషన్,సింగరేణి కార్మికులు.

## ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: చౌటుప్పల్ మండల కేంద్రంలో విజయ గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ధన్వంతరి స్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించి గ్రామీణ వైద్యులకు పండ్లు, నైవేద్యం, ప్రసాదాలు అందజేశారు. గ్రామీణ వైద్యులు ధన్వంతరి పూజా కార్యక్రమంలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు గట్టు సుధాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గట్టు సుధాకర్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల ఆరాధ్య దైవం ధన్వంతరి అన్నారు. దేవతలకే వైద్యుడు ధన్వంతరి అన్నారు. గ్రామీణ వైద్యులందరూ ఐకమత్యంగా ఉండి గ్రామీణ వైద్యుల సంఘానికి తోడ్పాటు అందిస్తూ సంఘానికి ఐక్యతకు ముందు నడపాలని సూచించారు. సంఘ సభ్యులకు ఎవరికైనా ఏదైనా సమస్య వస్తే, సభ్యులందరూ ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నలపరాజు లింగయ్య, జోనల్ అధ్యక్షుడు బొమ్మిడి సత్తిరెడ్డి, గౌరవాధ్యక్షులు గంగాపురం సత్యనారాయణ, పసుల యాదయ్య, నిమ్మల యాదగిరి, సాతిరి శ్రీధర్, మండల ఉపాధ్యక్షుడు మైలారం రాజు, ప్రధాన కార్యదర్శి కొంగరి ప్రసాద్, పరమేష్, మంత్రి యాదగిరి, మెండ మల్లేష్ భవనాబుషి, లింగాల వెంకటేశం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 1న కరీంనగర్‌కు బీసీ కమిషన్ బృందం రాక

- **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ వెల్లడి**


ప్రజాస్పూర్తి, సిరిసిల్ల: నవంబర్ 1న కరీంనగర్ బిసి కమిషన్ బృందం రానున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఒక ప్రకటనలో వెల్లడిరచారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 1న కరీంనగర్ కు విచ్చేస్తున్నట్లు తెలిపారు. రాజన్న సిరిసిల్ల మరియు కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నవంబర్ 1న కరీంనగర్ కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీ.సీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరుపనుందని వెల్లడిరచారు. అభిప్రాయాలు , సలహాలు, సూచనలు, తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థనలను నేరుగా ఎవరైనను సమర్పించవచ్చని సూచించారు. వారి అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందని, వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్‌కు నివేదించవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు.

## రామవరం ఈద్గా ఖబిరిస్తాన్ అధ్యక్షుడు గా ఎన్నికైన ఫహీమ్ దాదాకి ఘన సన్మానం



ప్రజా స్పూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రామవరంలోని ఐదు మసీదుల కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఫహీమ్ దాదాని ఖబిరిస్తాన్ , ఈద్గా అధ్యక్షులుగా ఎన్నుకోవటం జరిగింది.ఈ సందర్భంగా మదీనా మస్జిద్ సదర్ ఉస్మాన్ , వారి మస్జిద్ కమిటీ అధ్వర్యంలో ఫహీమ్ దాదా ని శాలువాతో సత్కరించి అభినందనలు తెలుపటం ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థిగా ఉన్నప్పటి నుండి విద్యార్థి ఉద్యమాల్లో చుడికైనా పాత్ర వహించాడని, కుల మతాలకు అతీతంగా రామవరం ప్రజలకు సేవలందిస్తూ వారి గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని పొందాడని, ఇప్పుడు కబరిస్తాన్ , ఈద్గా అధ్యక్షులుగా ఐదు మసీదుల కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం సంతోషకరంగా ఉందని వారు అన్నారు , ఈ కార్యక్రమంలో రామవరం మైనారిటీ నాయకులు గౌస్, షఫీ, ఖయ్యూమ్, అంకుష్, గులాం అసద్, షమ్మి ఉద్దీన్, అహమద్ పాషా, యాకూబ్ పాషా, అలీమ్, మగ్బుల్ పాషా, దస్తగిర్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వామివారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ హనుమంతరావు



యాదగిరిగుట్ట, ప్రజాస్పూర్తి : యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ గా నియమితులై బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా హనుమంతరావు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలకగా అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ప్రధానాలయంలోకి ఆహ్వానించారు. స్వయంభుల దర్శనం సందర్భంగా అష్టోత్తర సువర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచన మంటపంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కర శర్మ శ్రీ స్వామి వారి అభిషేక లడ్డు ప్రసాదం అందజేశారు.

# పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగాలివ్వాలి

**- పల్లె మధుకృష్ణ**



చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: చౌటుప్పల్ మండల పరిధిలోని పరిశ్రమలలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలివ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె మధు కృష్ణ డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండలం కుంట్లగూడెం గ్రామంలో డివైఎఫ్ఐ గ్రామ మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె కృష్ణ మాట్లాడుతూ చౌటుప్పల్ మండలంలో వందలాది పరిశ్రమలు ఉన్నాయని, ఆయా పరిశ్రమల వల్ల మండల వ్యాప్తంగా భూమి, నీరు, గాలిని కాలుష్యం చేస్తున్నారని ఆరోపించారు. కానీ ఆయా పరిశ్రమల యాజమాన్యాలు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ఆరోపించారు. పీజీ, డిగ్రీలు చేసిన స్థానిక యువతకు పరిశ్రమల యాజమాన్యాలు మాత్రం మొండి చేయి చూపిస్తున్నాయని దుయ్యబట్టారు. అర్హులైన యువతకు స్థానిక పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

# దేశ సమైక్యత కాపాడే అభ్యర్థికే అవకాశం కల్పించాలి

**- బందారపు లింగస్వామి**



చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: దేశ సమైక్యత, జాతీయత, సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడే టిపియుఎస్ అభ్యర్థికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం కల్పించాలని బిజెపి భువనగిరి పార్లమెంట్ కన్వీనర్ బందారపు లింగస్వామి కోరారు. వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓట్ల నమోదు కార్యక్రమాన్ని చౌటుప్పల్ మున్సిపాలిటీలోని తంగడపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. జాతీయ వాదులకు తమ మద్దతు తెలిపాలని కోరారు. ఈ సందర్భంగా బందారపు లింగస్వామి మాట్లాడుతూ ఉద్యోగ హామీల అమలులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిపియుఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పోలోజు శ్రీధర్ బాబు, బిజెపి మున్సిపల్ అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, ఆలె చిరంజీవి, ఊడుగు వెంకటేశం గౌడ్, ఉబ్బు బుచ్చయ్య, కట్ట కృష్ణ, కణతాల అశోక్ రెడ్డి, తొర్పునూరి కృష్ణ, కొండూరు దుర్గయ్య, బత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్పూర్తి) : పేద విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. మంగళవారం గాజులరామారం డివిజన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పదవ తరగతి విద్యార్థుల పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నోట్ బుక్ పుస్తకాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అక్షిత ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ సురేష్ కుమార్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, ఉపాధ్యక్షులు ఇబ్రహీం ఖాన్, నవాబ్ భాయ్, మూసా ఖాన్, గోవర్ధన్ రెడ్డి, సురేష్, సుంకరి చందు, వెంకటేష్, నవీన్, శేఖర్, మహిళా అధ్యక్షురాలు సంధ్యా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సన్నాలకు 500 రూపాయల బోనస్

*** ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి**



రాజపేట, (ప్రజాస్పూర్తి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన సన్నరకం వడ్లకు అదనంగా 500 రూపాయలు చెల్లించనుందని , నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధరను రైతులు పొందాలని ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి వరకు రాజపేట మండలంలోని రాజాపేట రేణిగుంట, పాముకుంట, సింగారం, కుర్రారం, పారుపల్లి, బొందుగుల, సోమవారం, దూది వెంకటాపురం, రఘునాథపురం, చల్లూరు, బేగంపేటలలో ధాన్యం కొనుగోలు సెంటర్లను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట పిఎసిఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్ రెడ్డి,ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిలువేరు బాలరాజుగౌడ్, మాడోత్ విటల్ నాయక్ పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాకల్ల ఉపేందర్, రైతు సమన్వయ సమితి చైర్మన్ గౌటే లక్ష్మణ్, పిఎసిఎస్ డైరెక్టర్లు జెన్నపల్లి ప్రభాకర్ రెడ్డి, బిక్షపతి గౌడ్, రేక నర్సింలు, మాడోత్ నర్సింగ్, గుంటి కృష్ణ,మర్ల నాగరాజు, రాజాపేట రైతు సమన్వయ సమితి కమిటీ చైర్మన్ దాచేపల్లి శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు, ఏవో పద్మజ, ఏఈవోలు, పిఎసిఎస్ సిబ్బంది, సెక్రటరీ సిల్వేరు శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి కి రైతులు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు కాంగ్రెస్ పార్టీ రైతుబిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, రాజపేట మండల పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, రాజపేట అధ్యక్షులు ఐరెని నవీన్ కుమార్, రేణిగుంట బొద్దుల నగేష్, రఘునాథపురం రమేష్, యువజన విభాగమ అధ్యక్షులు ఇంజ నరేష్, నీరటి బాల నర్సయ్య, నమిల కేదారి గౌడ్, అంకతి బాలయ్య, ఆడేపు శ్రీశైలం, దాచేపల్లి రాజు, రేగు సిద్ధులు, దూది వెంకటాపురం సత్యనారాయణ, జిల్లా మాజీ ప్రజా ప్రతినిధుల ఫోరం అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య, గౌరబక్కులు, పాము కుంట రంగా నరేష్ గౌడ్ తదితరులున్నారు.

# సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధికై పాటుపడాలి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్పూర్తి) : సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధికై పాటుపడాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. మంగళవారం పెట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మా నగర్ ఫేజ్ 1 నూతన సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీలో సిసి రోడ్డు పనులను పూర్తి చేసినందుకు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ సంక్షేమ సంఘం సభ్యులు కాలనీ అభివృద్ధికై పాటుపడుతూ ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు వారధిగా ఉండాలన్నారు. నూతన సంక్షేమ సంఘానికి మా మద్దతు ఎల్లవేళలా ఉంటుందన్నారు. ఇంకా ఏమైనా పనులు మిగిలిపోతే పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులుగా సత్తిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్ రెడ్డి, కోశాధికారిగా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్ రెడ్డి, కాలనీ సలహాదారులుగా ముత్యాలు, వెంకటేశ్వర్ రావు, శివానాగి రెడ్డి, ఖాసీం పీరా, జయసింహా రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా దయాకర్, సహాయ కోశాధికారిగా అరవింద్ యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా సత్యం, కృష్ణ రావు, వేణు, మోహన్, సుబ్బారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రంగసుబ్బయ్య, భాస్కర్ రెడ్డి, రమణ రెడ్డి, సందీప్ రెడ్డి, ఠాకూర్ వినోద్ సింగ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా సుబ్బారావు, సురేందర్ రెడ్డి, సంగమేశ్వర్ రావు, శ్రీనివాస్, ప్రభంజనం రెడ్డి, నర్సింహా రెడ్డి, భాస్కర చారి, చంద్రశేఖర్ రావు, నాగరాజ్, రాజేష్ ఫ్రాన్సిస్, వినోద్, రాజు, సోషల్ మీడియా కన్వీనర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# క్యూభా పై అమెరికా సామ్రాజ్యవాదం విధించిన ఆక్షలను ఎత్తి వేయాలి

*** సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఏ.అశోక్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్పూర్తి) : క్యూభా పై అమెరికా సామ్రాజ్యవాదం విధించిన ఆక్షలను ఎత్తి వేయాలని ఐక్యరాజ్య సమితిలోతీర్మానం చేయాలని సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఏ.అశోక్ అన్నారు. క్యూబా పై అమెరికా ఆంక్షలకు నిరసనగా మంగళవారం దేశ వ్యాప్తంగా క్యూబా సంఘీభావ ప్రదర్శనల లో భాగంగా సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ రైతు బజార్ నుండి సాగర్ హోటల్ చౌరస్తా వరకు అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా క్యూబా ప్రజలకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు అశోక్, సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ క్యూభా పై అమెరికా అనేక సంవత్సరాలుగా నిర్భంధాన్ని ఆంక్షలను విధిస్తూ ఆర్థిక వాణిజ్యాన్ని దెబ్బతెస్తుందన్నారు. దీంతో క్యూబా ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్యూభా పై అమెరికా సామ్రాజ్యవాదం విధించిన నిర్భందాన్ని ఆక్షలను ఎత్తివెయ్యాలని గతంలో క్యూబాకు అండగా మనదేశంలో ఉన్న వామపక్ష లౌకిక పార్టీల ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులను క్యూబా ప్రజలకు అందించడం జరిగిందన్నారు. 2024 ఆక్టోబర్ 28, 29 తేదీలలో ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సిఐటియు జాతీయ కమిటీ క్యూబా సంఘీభావ ర్యాలీలకి పిలుపునిచ్చిందని దాంట్లో భాగంగానే ఈరోజు ర్యాలీల నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రానున్న కాలంలో క్యూబా పై అమెరికా ఆంక్షలు ఇలాగే కొనసాగితే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచంలో ఉన్న కోట్లాది మంది కార్మిక వర్గం క్యూబాకు అండగా నిలబడతారని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు పసుల అంజయ్య , ఈ, దేవదానం, ఆది, నాగరాజు, బి, సత్యం పి,శంకర్, సందీప్, జాకీర్ హుస్సేన్, ముక్తార్ నాగేశ్వరరావు, కృష్ణ, లక్ష్మణరావు, వివిధ కంపెనీల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి పాదుకల పూజ



కుత్బుల్లాపూర్, (ప్రజాస్పూర్తి) : జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి పాదుకల పూజా కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. మంగళవారం కొంపల్లి మున్సిపాలిటీ ఎన్సీఎల్ నార్త్ కాలనీలో రాచర్ల రవిచంద్ర శర్మ ఆధ్వర్యంలో జగద్గురు "శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి గురుపాదుక పూజ" కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై గురుపాదుక పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ మంచి గురువు సాంగత్యంతో సరైన నడవడిక, మంచి ప్రవర్తన అలవరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవితా శ్రీశైలం యాదవ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు శిరీష ప్రవీణ్ రావు, సన్న రవి, నాయకులు నరేందర్ రెడ్డి, వేణు, రాము, జగన్మోహన్ రెడ్డి, రాంరెడ్డి, సంతోష్ రావు, చంద్రశేఖర్, చందర్ రాజు, సోమ శేఖర్, వేణు గౌడ్, శశిధర్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా అభివృద్ధికి అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం

### కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : జనాభా అభివృద్ధికి అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 20వ వార్డులోని జెఎన్ఎన్ యుఆర్ఎం లక్ష్మీ నగర్ కాలనీలో కౌన్సిలర్ మురళి యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 80 లక్షల రూపాయలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మున్సిపల్ చైర్ పర్సన్ శంబీపూర్ కృష్ణవేణి క్రిష్ణ లు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ శివారు ప్రాంతాలలో కొత్త కొత్త కాలనీలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శంబిపూర్ కృష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బెంబడి బుచ్చిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు డిల్లెశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, సలహాదారులు కామేశ్వర్ రావు, కాలనీ వాసులు లక్ష్మణ్, శ్యామ్, బాబీ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# వికసిత్ భారత్ దిశగా ముందుకెళ్తాం

## యువశక్తి సాయంతో ఎన్నో అద్భుతాలు

### ఉగ్రవాద చర్యలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం :కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

### భారతీయ విద్యాభవన్ పాఠశాలలో రోజ్‌గార్ మేళా,155 మందికి నియామక పత్రాలు



**తెలంగాణ బ్యూరో :** నగరంలోని భారతీయ విద్యాభవన్ పాఠశాలలో రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో ఎంపికైన 155మందికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం కిషన్‌రెడ్డి ప్రసంగించారు.'కేంద్ర విభాగాల్లో ఖాళీలు ఉండకూడదనే ప్రతి నెలా రోజ్‌గార్ మేళా నిర్వహిస్తున్నాం. ఇప్పటికే 9లక్షల మందికి నియామకపత్రాలు అందించాం. ఇవాళ దేశవ్యాప్తంగా 51వేల మందికి నియామక పత్రాలు అందిస్తున్నాం. వికసిత్ భారత్ దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నాం. వచ్చే 25 ఏళ్లపాటు మనకు అమృత కాలమని ప్రధాని మోదీ అంటారు. యువశక్తి సాయంతో మనం ఎన్నో అద్భుతాలు చేయొచ్చు. అనేక దేశాల్లో యువత తగ్గుతోంది.. మనవద్ద పుష్కలంగా ఉంది. ఇవాళ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. శాంతిభద్రతలు సరిగా లేకుంటే దేశంలోకి పెట్టుబడులు రావు. ఉగ్రవాద చర్యలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. వ్యవసాయ విధానాల్లో మార్పులు తెస్తున్నాం. విద్యుత్ కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం. విద్యుదుత్పత్తి పెంచి అన్నిరంగాల అభివృద్ధికి సహకరిస్తున్నాం'అని కిషన్‌రెడ్డి అన్నారు. రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి ప్రధాని మోడీ వర్చువల్‌గా ప్రసంగించారు.

# ఇది తెలంగాణ ప్రజల విజయం


- విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదన తిరస్కరణ
- నేడు, రేపు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు
- పిలుపునిచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఈఆర్సీ ఛైర్మన్ రంగారావు, సభ్యులు మనోహర్‌రాజు, కృష్ణయ్యకు కృతజ్ఞతలు



**తెలంగాణ బ్యూరో :** విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించినందుకు రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రజలపై రూ.18500 కోట్ల భారం పడకుండా ఆపినందుకు విజయ సూచికగా సంబురాలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో సంబరాలు జరపాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విద్యుత్ పెంపు ప్రతిపాదనలను తిరస్కరించినందుకు ఈఆర్సీ ఛైర్మన్ రంగారావు, సభ్యులు మనోహర్ రాజు, కృష్ణయ్యకు తెలంగాణ ప్రజల తరపున కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. విద్యుత్ చార్జీల పేరిట రూ.18,500 కోట్ల అదనపు భారం ప్రజలపై మోపడాన్ని హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్లలో నిర్వహించిన మూడు బహిరంగ విచారణలలో తాము తీవ్రంగా వ్యతిరేకించామని కేటీఆర్ తెలిపారు. ఇది తెలంగాణ ప్రజల విజయం అని కేటీఆర్ పేర్కొన్నారు.

# విమాన టికెట్ల ధరలను నియంత్రించండి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడికి లేఖ
- విమానయాన సంస్థలు, రైళ్లకు బాంబు బెదిరింపులు
- ఇంటలిజెన్స్ విభాగం ఏం చేస్తుందని మండిపాటు



**తెలంగాణ బ్యూరో :** విమాన టికెట్ల ధరలను నియంత్రించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ లేఖ రాశారు. విమాన ప్రయాణికులను విమాన సంస్థలు దోచుకుంటున్నాయని లేఖలో మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి మౌలిక సదుపాయాలు పొందుతున్న ప్రైవేట్ విమానయాన సంస్థలు అడ్డగోలుగా టికెట్ రేట్లు పెంచుతూ దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ప్రయాణ దూరం మారనప్పుడు టికెట్ ధరలు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. దేశ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని విమాన టికెట్ ధరలు నిర్ణయించాలన్నారు. విమానయాన శాఖ ప్రజల కోసం పని చేయాలేగాని, ప్రైవేట్ విమాన రంగ సంస్థల కోసం కాదని హితవు పలికారు. టికెట్ల ధరలు కార్పొరేట్ వ్యక్తులకే కాదు.. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అనుకూలంగా ఉండాలన్నారు. విమానయాన సంస్థల టికెట్లు ధరలను నియంత్రించకపోతే కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అవుతుందన్నారు. రైళ్లలోనూ వందేభారత్ పేరుతో కేంద్రం టికెట్ ధరలను పెంచి మెజార్టీ ప్రజలకు భారం చేసిందని విమర్శించారు. ప్రజా రవాణా భద్రతలో మాత్రం విఫలమవుతుందని ఆరోపించారు. వరుసగా వందల సంఖ్యలో విమానయాన సంస్థలకు, రైళ్లకు బాంబు బెదిరింపులు వస్తుంటే ఇంటలిజెన్స్ విభాగం ఏం చేస్తుందని ప్రశ్నించారు. సైకలాజికల్ టెర్రర్ కు గురిచేస్తూ అంతర్జాతీయ స్థాయిలో ఉగ్ర మూకలు రెచ్చిపోతున్నాయన్నారు. ప్రపంచంలో ఆకలి సూచిక హంగర్ ఇండెక్స్ లో ఇండియా 105వ స్థానంలో ఉండడం కేంద్ర ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని ఎద్దేవా చేశారు.

# బెదిరిస్తే భయపడను

- ఆరోపణలన్నీ అవాస్తవం
- బహిరంగ క్షమాపణ చెప్పాలి
- కేటీఆర్ లీగల్ నోటీసులకు బండి సంజయ్ కౌంటర్





**తెలంగాణ బ్యూరో :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమాధానమిచ్చారు. లీగల్ నోటీసుకుగాను కేటీఆర్‌కు కౌంటర్ నోటీసు పంపించారు. తాను చేసిన వ్యాఖ్యల్లో ఎక్కడా తప్పులేదని బండి తన రిప్లైలో స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలకు లీగల్ నోటీసు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. లీగల్ నోటీసు అంటూ బెదిరిస్తే భయపడేది లేదన్నారు. తనపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని కేటీఆర్‌ను కోరారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, ఇటీవల బండి సంజయ్ గ్రూప్ వన్ అభ్యర్థులతో కలిసి ఆందోళనల్లో పాల్గొని అరెస్టయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి బండి సంజయ్‌ని చర్చలకు పిలిచారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ చదువులేని బండిసంజయ్‌ని గ్రూప్‌వన్‌పై చర్చలకు పిలిస్తే ఏం లాభం అని విమర్శించారు. రేవంత్, బండి సంజయ్ కలిసి డ్రామా చేస్తున్నారని ఆరోపించారు. దీనికి ఆగ్రహించిన బండి కేటీఆర్‌పై వ్యక్తిగతంగా పలు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలకుగాను బండిసంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. తనపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని లేదంటే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

> **తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి**
>
> **తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారని కేంద్రమంత్రి బండి అన్నారు. విశాఖపట్నంలోని వీఎంఆర్డీఏలో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'ప్రధాని మోడీ రెండేళ్ల క్రితం రోజ్‌గార్ మేళా ప్రారంభించారు. పది లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన నిర్ణయించారు. రెండేళ్లలో 8లక్షల మందికి ఇప్పటికే ఉద్యోగాలు ఇచ్చారు. విశాఖపట్నంలో ఇంకా ఎంతో అభివృద్ధి జరగాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించింది మోదీ ప్రభుత్వమే'అని బండి సంజయ్ అన్నారు.**




### బెట్టింగ్ యాప్‌లతో నష్టపోయి..

# దొంగగా మారి..

- వ్యక్తికి అరెస్టు చేసిన పోలీసులు
- 334గ్రాముల బంగారు, కిలో 640 గ్రాముల వెండి అభరణాలు స్వాధీనం
- కేయూసీ, క్రైమ్ టీంను అభినందించిన వరంగల్ సీపీ

**తెలంగాణ బ్యూరో :** బెట్టింగ్ యాప్‌లతో నష్టపోయి దొంగగా మారిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సుమారుగా రూ.28.50లక్షల విలువగల 334గ్రాముల బంగారు, కిలో 640 గ్రాముల వెండి అభరణాలు, రూ.13వేల నగదు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్, చోరీలకు ఉపయోగించే సాధనాల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పోస్టల్ కాలనీలో నివాసముంటున్న ధర్మరాజు (30) డిగ్రీ పూర్తి చేసి కొద్ది కాలం బిర్యానీ సెంటర్ నిర్వహించి నష్టపోవడంతో హనుమకొండ పోస్టల్ కాలనీలో విద్యార్థినంటూ కిరాయి ఇంటిలో మకాం మార్చాడు. చోరీలపై అప్రమత్తమైన పోలీసులు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి నిందితుడిని పట్టుకున్నారు. పోలీసుల విచారణ చేయగా, నిందితుడు పాల్పడిన నేరాలను అంగీకరించాడు. నిందితుడి నుంచి పోలీసులు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేయూసీ, క్రైమ్ టీం లను వరంగల్ పోలీసు కమీషనర్ అభినందించారు.

# కాంగ్రెస్ బాంబులను ఎదుర్కొంటాం

- చిల్లర బెదిరింపులకు భయపడేది లేదు
- పాలన చేతకాకనే రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్
- పండుగల సమయంలో 144సెక్షన్లు పెట్టడం దుర్మార్గం
- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



**తెలంగాణ బ్యూరో :** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పొలిటికల్ బాంబుల కామెంట్స్‌పై సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీమంత్రి జగదీష్‌రెడ్డి స్పందించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు.'కాంగ్రెస్ బాంబులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. కాంగ్రెస్ సర్కారు దోపిడీ బాంబులను అడ్డుకుంటాం. మా హయాంలో తప్పు జరిగితే విచారణ జరుపుకోవచ్చు. కాంగ్రెస్ నేతల చిల్లర బెదిరింపులకు భయపడేది లేదు. మంత్రులు చిల్లర మాటలు బంద్ చేసి పాలనపై దృష్టి పెట్టాలి. బీఆర్ఎస్ పోరాటం వల్లే విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈఆర్సీ తిరస్కరించింది. పాలన చేతకాకనే రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర తీశారు. ప్రజాస్వామికవాదిగా చెప్పుకునే పెద్దమనిషి ఇప్పుడు ఎక్కడున్నారు? పెద్దమనిషి కాంగ్రెస్ సోషల్ మీడియాకు ట్రైనింగ్ ఇస్తున్నారు. పోలీసులే రోడ్డు ఎక్కడం చరిత్రలో ఇది మెదటిసారి. సీఎం సెక్యూరిటీ నుంచి స్పెషల్ పోలీసులను తప్పించడం అన్యాయం. భవిష్యత్‌లో రేవంత్ రెడ్డి ఆంధ్రకు వెళ్లి తలదాచుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. పండుగల సమయంలో 144సెక్షన్లు పెట్టడం దుర్మార్గం. కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకోవడానికి రాష్ట్ర ఖజానాను దెబ్బతీస్తున్నారు.పేదలకు చెందాల్సిన ఆదాయం మంత్రులు, కాంగ్రెస్ నేతలు తింటున్నారు. తెలంగాణను చీకట్ల నుంచి వెలుగులోకి తీసుకొచ్చింది కేసీఆర్. కాంగ్రెస్ అంటే ఏంటో ప్రజలు, రైతాంగానికి అర్థమైంది. దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలి. పత్తిని కొనుగోలు చేయాలి. నాణ్యత లేని గుజరాత్ పత్తికి ఎక్కువ ధర ఇస్తున్నారు'అని జగదీష్‌రెడ్డి మండిపడ్డారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్ట్‌లు చేయాలి

- జన్వాడ ఫామ్‌హౌస్ అంటేనే కాంట్రవర్సీ
- ఒకసారి దీపావళి విందు, మరోసారి గృహ ప్రవేశం అంటున్నారు..
- కేటీఆర్‌కు అసలు బినామీ విజయ్ మద్దూరి
- రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్



**తెలంగాణ బ్యూరో :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్ట్ లు చేయాలని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మంగళవారం అనిల్ మీడియాతో మాట్లాడారు. 'డ్రగ్స్ బయట పడిన ప్రతిసారి బీఆర్ఎస్ నాయకులు బయటికి వచ్చి మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సిగ్గు ఉంటే డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలి. రాజ్పాకాల, విజయ్ మద్దూరిని వెనుకేసుకరావడానికి కేటీఆర్‌కు సిగ్గుండాలి. కేటీఆర్‌కు అసలు బినామీ విజయ్ మద్దూరి. గతం ప్రభుత్వం డ్రగ్స్ కేసును ఏ విధంగా దారి మళ్లించిందో ప్రజలకు తెలుసు. జన్వాడ ఫామ్‌హౌస్ అంటేనే కాంట్రవర్సీ. ఒకసారి దీపావళి విందని, మరోసారి గృహ ప్రవేశం అని అంటున్నారు. తెలంగాణను కేసీఆర్ కుటుంబం ఏం చేయాలనుకుంటోంది. స్వయంగా డ్రగ్స్ వాడినట్లు పోలీసుల ముందు విజయ్ మద్దూరి ఒప్పుకున్నాడు. రాజ్ పాకాల డ్రగ్స్ ఇచ్చినట్లు విజయ్ మద్దూరి పోలీసులకు చెప్పాడు. ఇప్పుడు విజయ్‌మద్దూరి మాట మారుస్తున్నాడు. ఫామ్ హౌస్ దొర కేసీఆర్ డీజీపీకి ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నాడు. ఆయనకు పర్సనల్ ఇంట్రెస్ట్ ఏముంది. కేసీఆర్ ఎక్కడ ఉన్నాడని అని ప్రజలు అడుగుతున్నారు'అని అనిల్ గుర్తుచేశారు.

# సిద్దిపేట జిల్లాలో దారుణం

- మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం
- ముగ్గురు యువకులపై కేసు నమోదు

**తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోతోంది. ఇప్పటికే మహిళలపై నేరాలకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించినా.. మృగాళ్ల ఆలోచనల్లో మాత్రం మార్పు లేదు. నెలల పిల్లల నుంచి పండుముసలి వరకూ అందరిపైనా అఘాయిత్యాలకు తెగబడుతున్నారు. తాజాగా సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ పట్టణంలో ఇంటి ముందు ఆడుకుంటున్న మైనర్ బాలికపై ముగ్గురు యువకులు సామూహిక అత్యాచారం చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన గురించి బాలిక సోమవారం రాత్రి తన తల్లికి వివరించింది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. అత్యాచారం చేసిన ముగ్గురు యువకులు.. బాలిక ఉంటున్న కాలనీకి చెందినవారుగా గుర్తించినట్లు చెప్పారు. బాలికను వైద్య పరీక్షలకు పంపినట్లు సీఐ తెలిపారు.

**జగదేవ్‌పూర్‌లో మరో దారుణం..**

జిల్లాలోని జగదేవ్‌పూర్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. ఓ మహిళపై ఆటోడ్రైవర్ అత్యాచారానికి తెగబడ్డాడు. వట్టిపల్లి నుంచి సాల్వపూర్‌కు మహిళ నడుస్తూ వెళ్తుండగా ఆటో వచ్చింది. త్వరగా ఇంటికి చేరుకోవాలని ఆటో ఎక్కగా, దొరికిందే ఛాన్స్ గా భావించాడు ఆటో డ్రైవర్ . గ్రామానికి సమీపంలో ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి డ్రైవర్ నర్సింహులు అత్యాచారానికి పాల్పడ్డాడు.

## ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీకి సెబీ ఆమోదం..




**న్యూఢిల్లీ:** నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ యాజమాన్యంలోని అనుబంధ సంస్థ ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ మార్కెట్ నుంచి నిధులు సమీకరించేందుకు మార్గం సుగమమైంది. ఐపీఓకు సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.10వేల కోట్లు సమీకరించాలనే లక్ష్యంతో ఐపీఓకు రానుంది.

ఐపీఓ కోసం సెబీకి ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఈ ఏడాది సెప్టెంబర్ 18న దరఖాస్తు చేసుకోగా.. తాజాగా ఆమోదం లభించింది. ఈ ఐపీఓ ద్వారా రూ.10 ముఖవిలువ కలిగిన కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. సబ్‌స్క్రిప్షన్‌లో ఉద్యోగులకు ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందని కంపెనీ తెలిపింది. రిజర్వేషన్ పోర్షన్‌లో భాగంగా అర్హులైన ఉద్యోగులకు డిస్కౌంట్ అందిస్తున్నట్లు పేర్కొంది. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీలో షేర్ హోల్డర్ల కోటా ఉందని వెల్లడించింది. ఎవరి వద్ద అయితే ఎన్టీపీసీ షేర్లు ఉంటాయో వాళ్లు ఈ కోటా ద్వారా ఐపీఓకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐపీఓ ద్వారా వచ్చిన మొత్తంలో రూ.7,500 కోట్లను అనుబంధ సంస్థకు, రుణాలను చెల్లించడానికి కొంత మొత్తాన్ని, సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం మిగిలిన డబ్బును ఉపయోగించనుంది. మొత్తం రూ.10,000 కోట్లు సమీకరించాలనుకుంటున్న ఈ ఐపీఓ నవంబర్ మొదటివారంలో రానున్నట్లు సమాచారం. అయితే ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ఎప్పుడు ప్రారంభం కానుందనే విషయాన్ని సంస్థ ఇంకా వెల్లడించలేదు. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ.. అతిపెద్ద పునరుత్పాదక ఇంధన ప్రభుత్వ రంగ సంస్థ. జూన్‌లో ముగిసిన త్రైమాసికంలో సంస్థ కార్యకాలపాల ద్వారా వచ్చే ఆదాయం రూ.578.44 కోట్లుగా ఉంది. ఐడీబీఐ క్యాపిటల్ మార్కెట్స్ అండ్ సెక్యూరిటీస్ లిమిటెడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ లిమిటెడ్, నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ బుక్ రన్నింగ్ మేనేజర్లుగా ఉన్నారు.

## జియో పేమెంట్స్‌కు అగ్రిగేటర్ లైసెన్స్..


### ఫైనాన్షియల్ యాప్‌లో రూ.10కే డిజిటల్ గోల్డ్




**ముంబయి:** జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెందిన జియో పేమెంట్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఆన్‌లైన్ పేమెంట్స్ అగ్రిగేటర్‌గా కొనసాగేందుకు ఆర్‌బీఐ నుంచి అనుమతి లభించింది. ఈ విషయాన్ని కంపెనీ మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. అక్టోబర్ 28 నుంచి సర్టిఫికేషన్ చెల్లుబాటు అవుతుందని కంపెనీ పేర్కొంది. ఈనేపథ్యంలో జియో ఫైనాన్షియల్ షేరు నేడు రాణించింది. ఎన్ఎస్ఈలో స్వల్పంగా లాభపడి రూ.323 వద్ద కొనసాగుతోంది. మరోవైపు ధన్‌తేరస్ సందర్భంగా జియో ఫైనాన్షియల్ సంస్థ కొత్త సేవలకు శ్రీకారం చుట్టింది. జియో ఫైనాన్షియల్ యాప్ ద్వారా డిజిటల్ గోల్డ్ కొనుగోలు చేసేందుకు 'స్మార్ట్ గోల్డ్' సదుపాయాన్ని తీసుకొచ్చింది. తమ యాప్ ద్వారా ఎప్పుడైనా, ఎక్కడినుంచైనా డిజిటల్ గోల్డ్ కొనుగోలు చేయొచ్చని తెలిపింది. రూ.10 నుంచి పెట్టుబడి పెట్టొచ్చని పేర్కొంది. కావాలంటే డిజిటల్ గోల్డ్‌ను క్యాష్ రూపంలో గానీ, ఫిజికల్ గోల్డ్‌గానూ పొందొచ్చని తెలిపింది. జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్ కలిసి రెండు జాయింట్ వెంచర్ కంపెనీలను ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించాయి. జియో బ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, జియో బ్లాక్‌రాక్ ట్రస్టీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలను ఏర్పాటుచేశాయి. ఈమేరకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ నుంచి సర్టిఫికెట్ అందుకున్నట్లు ఇరు కంపెనీలు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. నియంత్రణ సంస్థల ఆమోదానికి లోబడి మ్యూచువల్ ఫండ్ కార్యకలాపాలను త్వరలో ప్రారంభించనున్నాయి.

## నష్టాల్లో ట్రేడవుతున్న సూచీలు..

### 24,300 దిగువన నిఫ్టీ




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల మధ్య ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 300 పాయింట్లు మేర నష్టపోగా నిఫ్టీ 24,300 దిగువన ట్రేడవుతోంది. ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 310 పాయింట్లు కుంగి 79,969 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 93 పాయింట్లు తగ్గి 24,259 వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.08 వద్ద కొనసాగుతోంది.

సెన్సెక్స్ 30 సూచీలో ఎంఅండ్ఎం, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్‌ఫిన్‌సర్వ్, మారుతీ సుజుకీ, హెచ్‌యూఎల్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఎన్టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ, టాటా స్టీల్, ఎల్అండ్‌టీ, నెస్లే ఇండియా.. ఈ ఆరు షేర్లు మాత్రమే లాభాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.56 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 2,764.80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

అమెరికా మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు స్వల్ప లాభాల్లో నడుస్తున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు సోమవారం నికరంగా రూ.3,228 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించగా, దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.1,401 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు.

# లక్నో నుంచి రాహుల్ ఔట్..




- కెప్టెన్‌గా పూరన్, రిటెన్షన్ లిస్ట్ ఇదే..!
- కేఎల్ రాహుల్‌ను విడిచిపెట్టనున్న లక్నో
- రాహుల్ ఆటతీరుపై ఫ్రాంచైజీ అసంతృప్తి
- నికోలస్ పూరన్‌కు కెప్టెన్సీ అప్పగించే అవకాశం

ఐపీఎల్‌లో ఆటగాళ్ల రిటెన్షన్ లిస్ట్ మరికొన్ని గంటల్లో విడుదల కానుంది. అక్టోబర్ 31 సాయంత్రంతో ఈ టైమ్ ముగియనుంది. ముఖ్యంగా భారత స్టార్ ప్లేయర్ కేఎల్ రాహుల్ సైతం ఈసారి వేలంలోకి రానున్నట్లు తెలుస్తోంది. గత మూడేళ్లుగా అతడు సారథ్యం వహిస్తున్న లక్నో సూపర్ జెయింట్స్ జట్టు.. అతడిని రిటైన్ చేసుకోవడం లేదని సమాచారం. ఈ మేరకు అతడు కాకుండా మిగతా ప్లేయర్లతో ఆ జట్టు రిటెన్షన్ లిస్ట్ ఫైనల్ అయినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

లక్నో: ఐపీఎల్ రిటెన్షన్ లిస్ట్ సమర్పించేందుకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే చాలా జట్లు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సిద్ధం చేశాయి. అయితే ఈసారి అందరి దృష్టి లక్నో సూపర్ జెయింట్స్ లిస్ట్‌పై నెలకొంది. ముఖ్యంగా కేఎల్ రాహుల్‌ను ఆ ఫ్రాంచైజీ రిటైన్ చేసుకుంటుందా లేదా అన్నది తేలాల్సి ఉంది. అయితే ఐపీఎల్‌లో గత మూడేళ్లుగా కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చిన లక్నో సూపర్‌జెయింట్స్ ఫ్రాంఛైజీ అతడిని పక్కన పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు లక్నో సూపర్ జెయింట్స్ ఇదివరకే రిటెన్షన్ లిస్ట్‌ను సిద్ధం చేసిందట. ఎన్నో ఆశలతో జట్టులోకి తీసుకున్న రాహుల్.. ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోవడంతో ఆ ఫ్రాంఛైజీ గుర్రుగా ఉంది. అంతేకాకుండా అతడి స్ట్రైక్ రేట్ కూడా పేలవంగా ఉందని ఆ జట్టు భావిస్తోంది. దీంతో రాహుల్‌ను వేలంలోకి విడిచిపెట్టాలని ఆ జట్టు నిర్ణయించినట్లు సమాచారం. గాయం కారణంగా కేఎల్ రాహుల్ అందుబాటులో లేని మ్యాచ్‌ల్లో వెస్టిండీస్ స్టార్ ప్లేయర్ నికోలస్ పూరన్ జట్టును నడిపించాడు. దీంతో అతడిని రిటైన్ చేసుకుని పూర్తి స్థాయి కెప్టెన్‌గా నియమించాలని లక్నో ఫ్రాంఛైజీ భావిస్తున్నట్లు సమాచారం. నికోలస్ పూరన్‌తో పాటు ఈ ఏడాదే ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన పేస్ సంచలనం మయాంక్ యాదవ్‌ను కూడా లక్నో రిటైన్ చేసుకుంటుందట. వీరితో పాటు యువ లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ కూడా లక్నో టాప్-3 ఆటగాళ్లలో ఉన్నాడని తెలుస్తోంది. వీరితో పాటు అన్‌క్యాప్డ్ ప్లేయర్ల కోటాలో పేసర్ మోసిన్ ఖాన్, మిడిలార్డర్ బ్యాటర్ ఆయుష్ బదోనీని కూడా ఎల్ఎస్‌జీ అట్టిపెట్టుకోనున్నట్లు సమాచారం. ఐపీఎల్ 2024 ముగియగానే కేఎల్ రాహుల్.. లక్నోతో బంధం తెంచుకున్నట్లు వార్తలొచ్చాయి. సన్‌రైజర్స్‌తో మ్యాచ్‌లో లక్నో చిత్తుగా ఓడటంతో ఆ జట్టు యజమాని సంజీవ్ గోయెంకా బహిరంగంగా ఆగ్రహం వ్యక్తం చేయడంపై.. రాహుల్ హర్ట్ అయ్యాడని.. దీంతో ఆ ఫ్రాంఛైజీకి దూరం కావాలని భావిస్తున్నాడని ఊహాగానాలు వినిపించాయి. అంతేకాకుండా ఇటీవల మేనేజ్‌మెంట్ కూడా రాహుల్ ఆటతీరును విశ్లేషించింది! అతడి స్ట్రైక్ రేటు టీ20లకు సరిపోవడం లేదని.. మెంటార్ జహీర్ ఖాన్ సహా లక్నో యాజమాన్యం, కోచ్ జస్టిన్ లాంగర్‌లు అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతేకాకుండా కేఎల్ రాహుల్ ఎక్కువ సేపు బ్యాటింగ్ చేసిన ప్రతీ మ్యాచులో జట్టు దాదాపుగా ఓడిపోయిందని గణాంకాల ద్వారా తెలిసింది. దీంతో అతడిని వదులుకోవాలని ఫ్రాంఛైజీ ఫిక్స్ అయింది.

## న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్.. ఇంగ్లండ్ స్క్వాడ్‌లో యువ ఆల్‌రౌండర్

**లండన్:** సుదీర్ఘ ఫార్మాట్‌లో బజ్‌బాల్ ఆటతో సంచలనాలు సృష్టించిన ఇంగ్లండ్ ఆసియా గడ్డపై సిరీస్ కోల్పోయింది. తొలి టెస్టులో ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో గెలుపొందినా.. వరుసగా రెండు మ్యాచుల్లో పాకిస్థాన్ చేతిలో చిత్తుగా ఓడింది. ఈ ఓటమి బాధ నుంచి తేరుకునేందుకు ఇంగ్లండ్ మరో సిరీస్‌కు సిద్ధమైంది. టీమిండియాపై వరుస విజయాలతో సిరీస్ గెలుపొందిన న్యూజిలాండ్‌తో ఇంగ్లీష్ టీమ్ తలపడనుంది. అందుకని బెన్ స్టోక్స్ సారథిగా సెలెక్టర్లు 16 మందితో కూడిన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు.

ఫార్మాట్ ఏదైనా గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇచ్చే ఇంగ్లండ్ బోర్డు ఈసారి కూడా బలమైన స్క్వాడ్‌ను ఎంచుకుంది. జాతీయ జట్టులో చోటు కోసం నిరీక్షిస్తున్న యువ ఆల్‌రౌండర్ జాకబ్ బెథెల్‌కు తొలిసారి అవకాశమిచ్చారు. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ అయిన జాకబ్ వార్విక్‌షైర్ జట్టు తరఫున అద్భుతంగా రాణిస్తున్నాడు. అందుకని పితృత్వ సెలవుల్లో ఉన్న జేమీ స్మిత్ స్థానంలో అతడిని ఎంపిక చేశారు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో వెనకబడిన ఇంగ్లండ్ నవంబర్‌లో కివీస్ గడ్డపై మూడు టెస్టుల సిరీస్ ఆడనుంది.





**ఇంగ్లండ్ స్క్వాడ్:** బెన్ స్టోక్స్(కెప్టెన్), జాక్ క్రాలే, బెన్ డకెట్, హ్యారీ బ్రూక్, ఓలీ పోప్, జో రూట్, బ్రైడన్ కర్సే. మాథ్యూ పాట్స్, గస్ అట్కిన్సన్, క్రిస్ వోక్స్, జాక్ లీచ్, రెహ్మాన్ అహ్మద్, ఓలీ స్టోన్, జాకబ్ బేథెల్, జోర్డాన్ కాక్స్, షోయబ్ బషీర్,

పాకిస్థాన్ పర్యటనలో చావుదెబ్బ తిన్న ఇంగ్లండ్ ఈ మూడు టెస్టుల సిరీస్‌లో విజయమే లక్ష్యంగా ఆడనుంది. అందుకని స్క్వాడ్‌లో ఆల్‌రౌండర్లకు చోటు కల్పించింది. క్రిస్ట్‌చర్చ్‌లోని హగ్లే ఓవల్ మైదానంలో నవంబర్ 28న ఇంగ్లండ్, న్యూజిలాండ్‌ల మధ్య తొలి టెస్టు జరుగనుంది. అనంతరం డిసెంబర్ 6వ తేదీన వెల్లింగ్టన్‌లో రెండో టెస్టు, హమిల్టన్‌లో డిసెంబర్ 14న మూడో టెస్టు నిర్వహించనున్నారు.

## రిటైర్మెంట్ ప్రకటించిన మాథ్యూ వేడ్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా క్రికెటర్ మాథ్యూ వేడ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. 2021 టీ20 వరల్డ్‌కప్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టులో అతను సభ్యుడిగా ఉన్నాడు. ఆస్ట్రేలియా జాతీయ జట్టుకు వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టాడతను. అయితే ఆట నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్లు మంగళవారం ప్రకటించాడు. కానీ కోచింగ్ బాధ్యతలను తీసుకోనున్నట్లు చెప్పాడు. 36 ఏళ్ల మాథ్యూ వేడ్ ఆస్ట్రేలియా తరపున 36 టెస్టులు, 97 వన్డేలు, 92 టీ20 మ్యాచ్‌లు ఆడాడు.

టాస్మానియా, బిగ్‌బాష్ లీగ్‌లో హోబర్ట్ తరపున దేశవాళీ క్రికెట్‌లో ఆడనున్నాడు. ఇటీవల జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో మాథ్యూ వేడ్ చివరిసారి ఆస్ట్రేలియా తరపున అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. కోచింగ్ గురించి చాన్నాళ్లుగా ఆలోచిస్తున్నట్లు వేడ్ తెలిపాడు. క్రికెట్ ఆస్ట్రేలియా తన ఎక్స్ అకౌంట్‌లో వేడ్ రిటైర్మెంట్ ప్రకటన రిలీజ్ చేసింది.




## ముంబై టెస్టుకు 'ఫ్లయింగ్ కిస్' పేసర్..

### తుది జట్టులో ఉండేదెవరో..?

**ముంబై:** స్వదేశంలో పెద్ద జట్లను సైతం మట్టికరిపించిన భారత జట్టు తొలిసారి తడబడుతోంది. న్యూజిలాండ్‌కు పోటీ ఇవ్వలేక 12 ఏండ్ల తర్వాత టెస్టు సిరీస్ కోల్పోయిన టీమిండియా విజయం కోసం నిరీక్షిస్తోంది. వరుసగా బెంగళూరు, పుణే టెస్టులో ఓడిన రోహిత్ సేన ముంబైలో భారీ తేడాతో గెలిస్తేనే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు మెరుగుపడుతాయి. అందుకని ఎట్టి పరిస్థితుల్లోనే వైట్‌వాష్ తప్పించుకోవాలనుకుంటున్న భారత్.. 'ఫ్లయింగ్ కిస్' పేసర్‌ను స్క్వాడ్‌లోకి తీసుకుంది.

ఐపీఎల్‌లో అదరగొట్టి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ఎంపికైన హర్షిత్ రానాను సెలెక్టర్లు ముంబై టెస్టు కోసం పిలిచారు. అలాగని పేస్ యూనిట్‌లో ఎవరూ గాయపడలేదు. అయినా సరే.. హర్షిత్‌ను తీసుకోవడానికి కారణం లేకపోలేదు. ఎందుకంటే.. రెండు టెస్టుల్లోనూ యార్కర్ కింగ్ జస్ప్రీత్ బుమ్రా, సిరాజ్.. పుణేలో ఆకాశ్ దీప్‌లను న్యూజిలాండ్ బ్యాటర్లు ఉతికేశారు.



ఈ నేపథ్యంలో సిరీస్‌లో బోణీ కొట్టాలంటే వైవిధ్యమైన పేసర్ అవసరం అనివార్యమైంది. అందుకని హెడ్‌కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మలు హర్షిత్‌ను మళ్లీ వెనక్కి పిలిచారు. కివీస్‌తో మూడు టెస్టుల సిరీస్‌కు ట్రావెల్ రిజర్వ్‌గా ఎంపికైన హర్షిత్‌కు తొలి రెండు టెస్టుల్లో చోటు దక్కలేదు. దాంతో, పేసర్‌ను రంజీ ట్రోఫీ ఆడేందుకు అనుమతించాలని ఢిల్లీ జట్టు కోరింది. అందుకని బీసీసీఐ పుణే టెస్టు సమయంలో హర్షిత్‌ను స్క్వాడ్ నుంచి విడుదల చేసింది.

కానీ, పుణే పిచ్ మీద కివీస్ స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ విజృంభణతో భారత జట్టు అనూహ్యంగా సిరీస్ కోల్పోయింది. అందుకని సిరీస్‌లో ఆఖరి మ్యాచ్‌కోసం హర్షిత్‌ను మళ్లీ రప్పించారు. హర్షిత్ తుది జట్టులోకి వస్తే.. ఆకాశ్ దీప్ లేదా సిరాజ్‌లలో ఒకరు బెంచ్ మీద ఉండాల్సిందే. కివీస్, భారత్‌ల మధ్య నామమాత్రమైన మూడో టెస్టు నవంబర్ 1వ తేదీన జరుగనుంది.

# కిల్ రీమేక్.. నిజం కాదు

రాఘవ లారెన్స్ హీరోగా బాలీవుడ్ బ్లాక్ బస్టర్ యాక్షన్ థ్రిల్లర్ 'కిల్'ను రీమేక్ చేస్తున్నారనే వార్త కొన్ని రోజుల కిందట సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. హాలీవుడ్లో సైతం రీమేక్ కాబోతున్న 'కిల్'ను దక్షిణాది భాషల్లో పునర్నిర్మించడానికి చర్చలు జరుగుతున్న మాట వాస్తవమే కానీ.. లారెన్స్ అందులో హీరో అనేసరికి జనాలకు ఫ్యూజులు ఎగిరిపోయాయి. తెలుగులో వీర, రాక్షసుడు, కిలాడి లాంటి సినిమాలు తీసిన రమేష్ వర్మ పెన్మత్స దర్శకత్వంలో ఈ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ సినిమా ప్రి లుక్ పోస్టర్లో లారెన్స్ బ్యాగ్రౌండ్లో రైలు బండి కనిపించగానే ఇది 'కిల్'



రీమేక్ అనే పుకార్లు మొదలయ్యాయి. జనాలు ఆ దృష్టితోనే ఈ సినిమాను చూస్తూ వచ్చారు. 'కిల్' రీమేక్కు లారెన్స్ ఎలా న్యాయం చేయగలడని తలలు పట్టుకున్నారు. లారెన్స్ సరసన త్రిష హీరోయిన్ అని వార్తలు రావడంతో మరింత అయోమయానికి గురయ్యారు. ఐతే సస్పెన్సుకి తెరదించుతూ లారెన్స్ రమేష్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'కిల్'కు రీమేక్ కాదనే విషయాన్ని మేకర్స్ చెప్పకనే చెప్పేశారు. ఈ రోజు ఈ సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ అయింది. ఈ చిత్రానికి 'కాల భైరవ' అనే టైటిల్ ఖరారు చేశారు.



సినిమా

# పెళ్లిచూపులు కాంబో రిపీట్ కాబోతుందా?

కొన్ని కాంబినేషన్ల కోసం సినీ అభిమానులతో పాటు చిత్ర సీమ కూడా గుడ్లప్పగించి చూస్తుంటుంది. అలాంటి కాంబో.... విజయ్ దేవరకొండ – తరుణ్ భాస్కర్. 'పెళ్లి చూపులు' సినిమాతో ఓ ట్రెండ్ సెట్ చేశారు వీరిద్దరూ. ఈ సినిమా చాలామందికి హోప్ ఇచ్చింది. చిన్న సినిమా రూపు రేఖలు మార్చింది. చాలా జీవితాలు ఈ సినిమాతో సెటిల్ అయ్యాయి. ఆ తరవాత విజయ్ దేవరకొండ స్టార్ హీరో అయిపోయాడు. తరుణ్ దర్శకుడిగా తన మార్క్ సినిమాలు చేసుకొంటూ వెళ్లాడు. ఈ సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరూ ఇప్పుడు బిజీ బిజీగా ఉన్నారు. అయితే 'పెళ్లి చూపులు' తరవాత విజయ్ – తరుణ్ కాంబోలో సినిమా రాలేదు. ఇప్పుడు అందుకు రంగం సిద్ధమవుతోంది.

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో విజయ్ హీరోగా ఓ సినిమా రూపుదిద్దుకోనుంది. ఇప్పటికే తరుణ్ భాస్కర్ కథ విని పించేశాడు. విజయ్ కూడా ఓకే చెప్పాడు. తరుణ్ ఇప్పటి వరకూ చిన్న, మీడియం రేంజ్ సినిమాలు చేస్తున్నాడు. ఈ సినిమాతో పంథా మార్చబోతున్నట్టు సమాచారం. యాక్షన్‌తో పాటు, తరుణ్ స్టైల్ ఆఫ్ కామెడీ టింజ్ ఉన్న సినిమా ఇది. భారీ బడ్జెట్ అవసరం. ఈ కాంబోలో సినిమా చేయడానికి చాలామంది నిర్మాతలు సిద్ధంగా ఉన్నారు. విజయ్ కూడా కొంతమంది నిర్మాతల దగ్గర అడ్వాన్స్ తీసుకొన్నాడు. వాళ్లలో ఈ ప్రాజెక్ట్ ఎవరి చేతికి వెళ్తుందన్నది ఆసక్తికరం.



# ప్రభాస్.. షారూఖ్ మల్టీస్టారర్ .. నిజమేంత?

ఇదివరకు మల్టీస్టారర్ సినిమాలు చేయాలంటే హీరోలు ధైర్యం చేసేవారు కాదు. ఇమేజ్, ఫ్యాన్స్ అంటూ రకరకాలుగా ఆలోచించేవారు. ఇప్పుడు అలా లేదు. సోలో హీరో సినిమాలకంటే మల్టీస్టారర్‌లకే క్రేజ్ ఎక్కువ ఉంది. హీరోలూ... ఇలాంటి కథలు చేయడానికి రెడీగా ఉంటున్నారు. పైగా మల్టీస్టారర్ల వల్ల మార్కెట్ పెరుగుతోంది కూడా. అయితే ప్రభాస్ మాత్రం ఓ మల్టీస్టారర్ కథకు నో చెప్పినట్టు సమాచారం.

వివరాల్లోకి వెళ్తే... బాలీవుడ్ దర్శకుడు సిద్దార్థ్ ఆనంద్ తో ప్రభాస్ ఓ సినిమా చేయాలి. ఎప్పటి నుంచో ఈ ప్రాజెక్ట్ నలుగుతోంది. కానీ వీలు కావడం లేదు. మధ్యలో షారుఖ్‌తో 'పఠాన్' సినిమా తీసి సూపర్ హిట్టు కొట్టాడు సిద్దార్థ్. ఈ సినిమాతో షారుఖ్ కెరీర్‌కు పునః వైభవం వచ్చింది. బాలీవుడ్ కూడా ఈ హిట్ తో ఊపిరి పీల్చుకొంది. 'పఠాన్' తరవాత సిద్దార్థ్ తో కలిసి సినిమా చేయడానికి చాలామంది హీరోలు ముందుకు వచ్చారు. కానీ సిద్దార్థ్ మాత్రం తనకు ప్రభాస్ కావాలని పట్టుపట్టాడు. ప్రభాస్ కూడా సిద్దార్థ్ తో సినిమా చేయడానికి రెడీగానే ఉన్నాడు. అయితే ఈసారి సిద్దార్థ్ ఓ మల్టీస్టారర్ కథ రాసుకొచ్చాడు. ఓ హీరోగా షారుఖ్ ఫిక్స్. సౌత్ నుంచి మరో హీరో కావాలి. అది ప్రభాస్ అయితే బాగుంటుందన్నది సిద్దార్థ్ ఆలోచన. అయితే ప్రభాస్ మాత్రం ఈ మల్టీస్టారర్ కథకు నో చెప్పాడు. తనకు మల్టీస్టారర్లు చేయడం ఇష్టం లేదని, సోలో హీరోగా కథ చెబితే చేస్తానని చెప్పి పంపించేశాడని టాక్.

ఇప్పుడు సిద్దార్థ్ ఆనంద్ మరో హీరో కోసం అన్వేషణ మొదలు పెట్టాడు. ప్రభాస్‌కు తగిన కటౌట్ సిద్దార్థ్‌కు దొరకడం కష్టమే. అయితే ఆ క్యారెక్టర్ అయినా కాస్త మార్చాలి. లేదంటే... దొరికిన వాళ్లతో సర్దుకుపోవాలి.

# పూజా హెగ్డేతో మూవీ చేయాలని ఉంది.. ఓపెన్ అయిన ఆ నిర్మాత

నందమూరి బాలకృష్ణ హోస్ట్ చేస్తున్న అన్ స్టాపబుల్ సీజన్ 4 గత వారం ప్రారంభమైంది. మొదటి ఎపిసోడ్ లో చంద్రబాబు సందడి చేశారు. ఆహాలో ఈ మొదటి ఎపిసోడ్ స్ట్రీమింగ్ అవుతోంది. ఇక రెండో ఎపిసోడ్‌కు ఎవరు వస్తారా ? అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రమంలో రెండో ఎపిసోడ్‌కు సంబంధించిన ప్రోమో వచ్చేసింది. రెండో ఎపిసోడ్‌కు లక్కీ భాస్కర్ మూవీ టీమ్ సెకండ్ ఎపిసోడ్ లో సందడి చేసింది. హీరో దుల్కర్ సల్మాన్‌తో పాటు హీరోయిన్ మీనాక్షి చౌదరి, దర్శకుడు వెంకీ అట్లూరి, నిర్మాత నాగ వంశీలు ఈ షోలో కనిపించారు. ఇక ప్రోమో ప్రారంభంలో బాలయ్య పోలీస్ ఆఫీసర్ గెటప్‌లో ఎంట్రీ ఇవ్వగా గడ్డు కాలం ఎదురొచ్చినా, చెడ్డవాడు ఎగేసుకొచ్చినా అనే డైలాగ్‌ను తనదైన శైలిలో చెప్పి అలరించారు. ఇక తరువాత దుల్కర్ సల్మాన్ స్టేజ్ పైకి రాగానే ఏంటి ఈ గ్లామర్ నన్ను నేను చూసుకున్నట్లుగా ఉంది అని దుల్కర్‌తో బాలయ్య అనగా ఆయన సిగ్గు పడుతూ కనిపించారు. ఇక మరోపక్క ఈ క్రమంలో నిర్మాత నాగవంశీ పలు ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. ఎవరైనా హీరోయిన్ తో సినిమా చేయాలి అని ఏమైనా ఉందా అని వెంకీ అట్లూరిని అడిగితే దానికి నాగవంశీ స్పందిస్తూ వెంకీకి ఎప్పటినుంచో పూజా హెగ్డేపై కన్నుందని అన్నాడు. మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ లేటెస్ట్ మూవీ 'లక్కీ భాస్కర్'. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న థియేటర్లలోకి వస్తోంది. ఇప్పటికే దాదాపు ప్రమోషన్స్ ను వేగంగా చేస్తూ అందులో భాగంగానే 'అన్‌స్టాపబుల్' షోలో పాల్గొన్నారు.







# టబు పెళ్లిచేసుకోబోతుందా? మళ్లీ పుకార్లు స్టార్ట్

ఒకప్పటి అందాల తార టబు వయసు ఇప్పుడు 52 ఏండ్లు. పెండ్లి వయసు ఎప్పుడో దాటిపోయింది. ఇక ఆమె పెళ్లి చేసుకుంటుందని ఎవరూ అనుకోవడం లేదు. కానీ ఇప్పుడు టబుకు సంబంధించి ఓ పెళ్లి వార్త తెగ చక్కర్లు కొడుతోంది. టబు పెళ్ళికి రెడీ అయ్యిందని వార్తలు వస్తున్నాయి. కానీ, టబుకి పెళ్లి పై ఎలాంటి ఆసక్తి లేదని టాక్. ప్రస్తుతం వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఒంటరిగానే ఉంటున్న టబు.. పెళ్లి పై గతంలో తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ బోల్డ్ కామెంట్స్ చేసింది. ఇంతకీ, టబు అప్పుడు ఏ కామెంట్స్ చేసిందంటే..'పెళ్లి నాకు సరిపడదు. అందుకేనేమో.. నాకు ఇంకా పెళ్లి కాలేదు. కానీ.. నాకు తల్లి అవ్వాలనే ఆశ మాత్రం ఉంది. తప్పు లేదు కదా. ఆశ ఎవరికైనా ఉండొచ్చు. అయినా, తల్లి కావడానికి పెళ్లి కావాల్సిందే అంటూ కొందరు ఫీల్ అవుతూ ఉంటారు. నా దృష్టిలో తల్లి అవ్వాలనుకుంటే పెళ్లి చేసుకోవాల్సిన అవసరం లేదు. పెళ్లి కాకుండానే గర్భం దాల్చవచ్చు. సరోగసితో కూడా తల్లి అయ్యే అవకాశం మనకు ఉంది కదా' అంటూ టబు అప్పుడు చెప్పుకొచ్చింది. కాబట్టి, ఆమె పెళ్లి చేసుకోకపోయినా తల్లి అవుతుంది అంటూ నెటిజన్లు పోస్ట్ లు పెడుతున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.